Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 14.07.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 06 పేజీలు : 12, వెల : ₹ 5



కేర్
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు
• రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత
• రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

• ఇక జనంలోకే జగన్

# పాదయాత్రతో మరో చరిత్ర



- ఏడుకొండలవాడి సాక్షిగా 6 నెలలు, 3000 కిలోమీటర్లు
- స్వచ్ఛంధంగా విజయవంతమైన ప్లీనరీ
- ఆకట్టుకున్న జగన్ 9 పథకాలు
- బాంబుల్లా పేలిన ప్రసంగాలు

*గతానికి భిన్నంగా, గతంకంటే ఉత్సాహంగా ఆంధ్రప్రదేశ్ నడిబొడ్డు గుంటూరు కేంద్రంగా రెండు రోజుల పాటు జరిగిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్లీనరీ సమావేశాలు ప్రభుత్వంపై ప్రజల్లో వున్న వ్యతిరేకతకు, ప్రజానేత జగన్‌పై వున్న నమ్మకానికి నిదర్శనంగా నిలిచాయి.*

ప్రతిఏటా ఇడుపులపాయలో వైసిపి ప్లీనరీలు జరిగేవి. అయితే అక్కడ దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి సమాధి ఉండడం తప్ప ఆ ప్రాంతంలో ఇంకెటువంటి రాజకీయ ప్రాధాన్యత లేదు. కాని, ఈసారి ప్లీనరీకి గుంటూరును ఎంచుకుని రాజకీయ వ్యూహాత్మకంగా ముందడుగు వేసాడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి. కొంతకాలం క్రితమే విశాఖ కేంద్రంగా తెలుగుదేశంపార్టీ వాళ్లు నిర్వహించిన మహానాడుకు, నిన్న జరిగిన వైసిపి ప్లీనరీకి తేడా కొట్టొచ్చినట్లు కనిపించింది. మహానాడులో అధికార ఆర్భాటం స్పష్టంగా కనిపిస్తే, వైసిపి ప్లీనరీలో మాత్రం పార్టీపై అభిమానం, ప్రభుత్వం పట్ల వున్న వ్యతిరేకత స్పష్టమైంది.

గుంటూరు ప్లీనరీని ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి చక్కని రాజకీయ వేదికగా మలచుకున్నాడు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను స్పష్టంగానే ప్రకటించ గలిగాడు. రాష్ట్రంలో మూడేళ్ల చంద్రబాబు పాలనను ఎండగట్టడంలోనే కాదు, తాము అధికారంలోకి వస్తే

(మిగతా 11వ పేజీలో)

ప్రత్యేకంగా...

# 'పీకే'దేమీ లేదు



- ప్రభుత్వ వ్యతిరేకతను అనుకూలంగా మలచుకుంటే చాలు
- ఎన్నికల ట్రైనింగ్‌కు నిపుణులు అక్కరలేదు

*జగన్ అంటే జనంలో అపార అభిమానముంది. వై.యస్. కుటుంబంతో తెలుగు లోగిళ్ళకు అపురూప అనుబంధముంది. "రాజన్న"న్నా ఆయన కుమారుడన్నా ప్రాణాలిచ్చే అభిమానులు తెలుగు నాటంతా వున్నారు. ఎవరు చెప్పినా ఎవరు చెప్పకపోయినా రాజశేఖరరెడ్డి కోసం ఆయన కుటుంబం కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలు వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీకి సిద్ధంగా వున్నారు.*

(మిగతా 11వ పేజీలో)



శ్రీ సన్నపరెడ్డి విజయకుమార్‌రెడ్డి గారు
జననం: 27.10.1954 మరణం: 10.07.2017

## ఉత్తరక్రియలు

ఆత్మీయత, అనుబంధాలకు
బంధువులే అయ్యుండనక్కరలేదు,
మనసుకు నచ్చిన వారందరూ
ఆత్మీయులే, ఆత్మబంధువులే అని నమ్మిన
**శ్రీ సన్నపరెడ్డి విజయకుమార్‌రెడ్డి గారు**
తే.10.07.2017ది
సోమవారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతిని చేకూర్చాలని
భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: శైలజ

కుమారుడు - కోడలు
సన్నపరెడ్డి కృష్ణకిషోర్‌రెడ్డి - బ్రిజిల
మనుమరాళ్ళు: మాహ్యశ్రీ, పూజిత

కుమార్తె - అల్లుడు
అపర్ణ - ఏలూరు హరీష్‌కుమార్‌రెడ్డి
మనుమడు: సాయి ఉత్కర్ష్

తమ్ముడు - మరదలు:
సన్నపరెడ్డి వేణుగోపాలరెడ్డి - అనిత
మాజీచైర్మెన్, జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానం.
సెల్. 99001 45678, 99895 00007

**ఉత్తరక్రియలు:**
తే. 20.07.2017ది గురువారం
నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులో డమ్రో షోరూమ్
ఎదురుగా వెంకటాద్రి హోమ్స్‌లోని
మా స్వగృహామునందు జరుగును.
కావున తెలియజేయడమైనది.

కేఈ నెందుకూ...

# కొడుకునే పంపొచ్చుగా...?




- ఈ బాబు సత్తా, సమర్ధతపై తన 'బాబు'కు నమ్మకం లేదా?

*నవ్యాంధ్ర సారధి చంద్రబాబునాయుడు ఆస్తులకే కాదు, ఆయన రాజకీయ చరిత్రకు కూడా వారసుడు లోకేష్‌బాబు. చంద్రబాబు తర్వాత పార్టీని నడపాల్సింది కూడా ఆయనే! మరి రేపు పార్టీని నడపాల్సిన నాయకుడు ఎలా ఉండాలి? ముందు ఆ సమర్ధతను నిరూపించుకోవాలి. పార్టీని, కేడర్‌ను కాపాడుకోగలనన్న నమ్మకాన్ని పార్టీ వారిలో కల్పించాలి.*

దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి వున్నప్పుడే జగన్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చాడు. ప్రజాక్షేత్రంలో దిగి కడప లోక్‌సభ నుండి ప్రత్యక్ష ఎన్నిక ద్వారానే ఎంపీగా గెలిచాడు. వై.యస్. మరణం తర్వాత కాంగ్రెస్‌నే

(మిగతా 11వ పేజీలో)

# బాబోయ్.. 'క్రూర'గాయలు



- **టమోటాలు కిలో వంద... వంకాయలూ అంతే...!**
- **ధరలు ఆకాశానికంటినా...పట్టించుకోని అధికారగణం**

***నెల్లూరులో గతంలో ఎప్పుడూ లేనివిధంగా కూరగాయల ధరలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. కరువు కాలంలో కూడా ఇంత ధరలెప్పుడూ లేవు. ఏ కూరగాయలైనా సరే ముట్టుకుంటే మండిపోతున్నాయి. 'భలే కొన్నావులే పో'..అంటూ సామాన్యుల వైపు గుర్రుమంటూ క్రూరంగా చూస్తున్నాయి.***

వంకాయల బుట్టలో వేలుపెడితే చాలు.. సర్రుమంటుంది ధర. వందరూపాయల కాయితం ఉంటే తప్ప కిలో వంకాయలు రావు. అయినా, ముక్కారు పండే నెల్లూరుసీమలో వంకాయలు వంద రూపాయలు అమ్మడం ఎప్పుడైనా విన్నామా?.. కిలో టమోటాలు 80 నుంచి 100 దాకా అమ్ముతారని కలలోనైనా అనుకున్నామా?... ఒక్క వంకాయలు, టమోటాలే కాదు అన్ని కూరగాయల ధరలూ ఇలాగే భగ్గుమంటున్నాయి. క్యారెట్, బీన్స్ వగైరాలన్నీ కూడా వందిస్తేనే సంచిలో పడేది. చివరికి బీరకాయలు కూడా కిలో 60 నుంచి 70దాకా ఉంది. 50 రూపాయలు తీసుకెళ్తే బోలెడన్ని కూరగాయలు వచ్చే రోజులు పోయి, 500 తీసుకెళ్ళినా చిన్న సంచీ కూడా నిండని దుస్థితి వచ్చేసింది. ఇది కలికాలమో.. ఆకలి కాలమో తెలియదు కానీ, అన్ని ధరలూ హాయిగా ఆకాశానికి అంటిపోతున్నా, సామాన్యుడు ఈ ధరలతో బతకలేక చస్తున్నా అటు ప్రభుత్వాలు కానీ, ఇటు పాలకులు కానీ పట్టించుకోకపోవడమే దారుణం. ఎప్పటికప్పుడు జనాన్ని ఉద్ధరించేటట్టు ఊకదంపుడు ఉపన్యాసాలే తప్ప, ప్రజలకు నిత్యావసరాలైన వస్తువుల ధరల నియంత్రణకు చేసిందేమీ ఉండడం లేదు. కొంటే కొనండి..లేకుంటే మానుకోండి..అన్నట్లుగా ఎవరికి వారు నిర్లక్ష్యంగానే ఉంటున్నారు. వర్షాల వల్ల తోటలు దెబ్బతిన్నాయని వ్యాపారులు చెప్తున్నప్పటికీ, మార్కెట్లో కొరత లేకుండా కూరగాయలు వస్తూనే ఉన్నాయి. కానీ ధరలు మాత్రమే బోలెడంత పెరుగుతున్నాయి. తూకమైనా సరిగ్గా ఉంటుందా అంటే..అదీ నమ్మకం లేదు. అదేమని అడిగితే లేనిపోని కసుర్లు..విసుర్లు.

కారణాలు ఏమైనా, వంకాయలు కిలో వంద, టమోటాలు కిలో వందరూపాయలు పెట్టి కొనాలంటే సామాన్యులు, పేదలకు సాధ్యమా?.. అని ఆలోచించేవారే లేరు. అంతంత ధరలు పెట్టి కొనాలంటే జరిగే పనేనా?.. మార్కెట్లలో ఉండే ధరలే మండిపోతుంటే, ఇక వీధుల్లో వాడల్లో వుండే చిన్న చిన్న కూరగాయల దుకాణాల్లో ఇదే అదనుగా ఆ ధరలు మరింతగా పెంచేస్తున్నారు. ధర బాగా పెరుగుతుందని తెలిసే కూరగాయలను ముందస్తుగా తెచ్చుకుని, అదనుచూసి ధరలు మరింతగా పెంచి అమ్ముకునే తెలివిగల వ్యాపారులు మరెంతో మంది. ధరెంతున్నా కొనే మారాజులు ఎలాగూ ఉంటారు కాబట్టి వారివారి వ్యాపారాలు జోరుగానే ఉంటున్నాయి కానీ, సామాన్య వినియోగదారులే రోజూ బిక్కముఖంతో దిగాలుపడిపోతున్నారు. కేవలం పది రూపాయలకే వచ్చే కూరగాయలు కూడా ఇప్పుడు 50 పైగానే ధరలు పలుకుతున్నాయి. పచ్చిమిరపకాయలు కిలో 60, ముల్లంగి కిలో 60, అల్లం కిలో 80. కొంటే కొనండి.లేకపోతే పొండి. ఇకపోతే, గోరుచిక్కుడు, మునక్కాయలు, కాకరకాయలు, బీట్రూట్ వంటివన్నీ కిలో 40పైమాటే. మొన్న మొన్నటి దాకా 10రూపాయలున్న కొత్తిమీర కట్ట కావాలంటే ఇప్పుడు 20 ఇవ్వాలి. పొదీనా కూడా అంతే. కరేపాకు గతంలో 5 రూపాయలిచ్చినా ఇచ్చేవారు. ఇప్పుడు పది రూపాయలు లేనిదే రావడం లేదు. ఆకుకూరలు, కూరగాయలు పోటాపోటీగా పెరుగుతూనే ఉన్నాయి. ఈ ధరలు కూడా నగరంలో ఒక్కో చోట ఒక్కో విధంగానూ, జిల్లాలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగానూ ఉంటాయి. అయితే, ఎక్కడైనా మరింత పెరిగే ధరలే తప్ప తరగడమన్నది ఉండడం లేదు. ఇలా అన్నిటి ధరలూ పెరిగిపోయి సామాన్య, మధ్యతరగతి ప్రజలు, పేదలు నిత్యం నానా అవస్తలు పడుతున్నా పట్టించుకునే నాధులే లేరు. కోట్లాది రూపాయల పథకాలంటూ ప్రజలను మభ్యపెట్టడమే తప్ప, రోజూ కనీసం మంచి కూరలు తినేందుకు కూడా మొహం వాచిపోతున్న పేదల, సామాన్యుల స్థితిగతులను పట్టించుకునేవారే లేరు. రైతుబజార్లంటూ అక్కడక్కడా నామకార్థం ఉన్నాయే తప్ప వాటి వల్ల సామాన్య జనానికి ఒరిగిందేమీ లేదు. ధరలు ఆకాశానికి అంటిపోయి ప్రజలు విలవిలలాడిపోతున్నా ఒక్క అధికారికి కానీ, నాయకునికి కానీ పట్టడం లేదంటే, వారు ప్రజలతో ఎంత మమేకం అవుతున్నారో అర్ధమవుతూనే ఉందని, ప్రజల సమస్యలను పరిష్కరించడమే మా ధ్యేయం..అంటూ గొప్పలు చెప్పుకునే నాయకులు..ప్రజలకు నిత్యసమస్యగా మారిపోయిన కూరగాయల ధరలు ఇంతగా మండిపోతున్నా నిర్లిప్తంగానే ఉండడం ఏమిటని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు మార్కెట్లలో ఈ ధరలను పరిశీలిస్తూ, అనూహ్యంగా పెరిగిపోతున్న కూరగాయల ధరలను నియంత్రిస్తూ, అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేస్తూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారగణం ఎప్పుడో తనిఖీల పేరుతో హడావిడీ చేయడమే తప్ప ఈ బాధలు అసలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీఎస్టీ వస్తే సామాన్యులకు అవసరమైన వస్తువుల ధరలు పెరగవని, కూరగాయల ధరలు కూడా పెరగవని అనుకున్నవారంతా ఆచరణలో అవి మూడింతలు నాలుగింతలు పెరగడంతో గుండెలు బాదుకుంటున్నారు. ఏదేమైనా, భగ్గుమని మండిపోతున్న కూరగాయలను కొనలేక పేద, మధ్యతరగతి గృహిణులు పడే వేదన వర్ణనాతీతం. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఈ మండే ధరలపై దృష్టి సారించి బాగా నియంత్రించి, ఈ ధరల బాదుడు నుంచి ప్రజలను వెంటనే ఆదుకోవాల్సి ఉంది.

## అన్నపూర్ణకు అభినందన



నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా ప్రముఖ రచయిత్రి పాతూరి అన్నపూర్ణకు మంగళవారం నెల్లూరు టౌన్‌హాలు సమావేశ మందిరంలో అభినందన సభ జరిగింది. నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నెరసం అధ్యక్షుడు ఎ.జయ ప్రకాష్, అన్నపూర్ణను శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

## సమాజ సంక్షేమమే ఏఐసిఎఫ్ లక్ష్యం



అభాగ్యులకు చేయూతనందించి వారి అభ్యున్నతికి కృషి చేయడమే తమ లక్ష్యమని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసిఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉపాధి పథకం రాష్ట్ర డైరెక్టర్ ఊరందూరు సురేంద్రబాబు పేర్కొన్నారు. పడారుపల్లి వికలాంగుల కాలనీలోని ఆచార్య పిసిరెడ్డి సమాజ మందిరం నిర్వాహకురాలు, క్రాంతి మహిళామండలి అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి పర్యవేక్షణలో మంగళవారం ఏఐసిఎఫ్ సంయుక్త కార్యదర్శి సుకన్య కుమారి జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐసిఎఫ్ నెల్లూరు డిస్ట్రిక్ట్ పాస్టర్స్ సెల్ ఛైర్మన్ రెవరెండ్ ప్రేమ్‌కుమార్ వాక్యపరిచయం చేశారు. రాగోపాల్‌రెడ్డి, సమత, రాజశేఖర్, శ్రావ్య, సుధ, ప్రత్యూష, మీనా, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.



## సత్వర న్యాయం లోక్‌అదాలత్ లక్ష్యం

దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా నెల్లూరుజిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీ లోక్‌అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్‌అహ్మద్ మౌలానా ప్రారంభించి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నానాటికి పెరుగుతున్న పెండింగ్ కేసులను పరిష్కరించి న్యాయస్థానాల పనిభారాన్ని తగ్గించడమే లక్ష్యంగా లోక్‌అదాలత్‌లు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన లోక్‌అదాలత్‌లో మొత్తం 1136 సివిల్, క్రిమినల్, మోటారు ప్రమాద వాహనాలు, బ్యాంక్, ఫైనాన్స్ కేసులు పరిష్కరించారు. లబ్దిదారులకు రూ.4.05కోట్లు పరిహారం లభించింది. గూడూరులో 110కేసులు, కోవూరులో 79, కావలిలో 219, ఆత్మకూరులో 95, వెంకటగిరిలో 32, కోటలో 52, సూళ్లూరుపేటలో 128, నాయుడుపేటలో 36, ఉదయగిరిలో 38 కేసులు పరిష్కారమయ్యాయి. నెల్లూరు నగరంలో 347 కేసులు పరిష్కరించి తద్వారా రూ.3.70 కోట్ల మేర పరిహారాన్ని లబ్దిదారులకు అందజేశారు. న్యాయమూర్తులు మహమ్మద్ అబ్దుల్ రఫి, పి.జె.సుధ, టి.వి.సుబ్బారావు, టి.కేశవ, టి.వాసుదేవన్, ఎస్.కె.ఎం.డి అబూతాలీప్ పర్వేజ్‌లు ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించారు.

## 16న 'మాటముల్లు' ఆవిష్కరణ

ప్రముఖ కవి గుర్రాల రమణయ్య రచించిన 'మాటముల్లు' కవితాసంపుటిని ఈనెల 16న ఆవిష్కరించనున్నట్లు జిఆర్ ట్రస్ట్ ఒక ప్రకటనలో పేర్కొంది. నెల్లూరులోని ఐఎంఎ హాల్‌లో ఆరోజు ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, విశిష్ట అతిధులుగా ప్రముఖ కవి కె.శివారెడ్డి పాల్గొంటారని, జివిఆర్ కల్చరల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గుదిబండి వెంకటరెడ్డి సభకు అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. ముఖ్యఅతిధులుగా ప్రముఖ సైకియాట్రి ప్రొఫెసర్ టిపి సుధాకర్ (తిరుపతి), ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ జి.మురళీధర్ పాల్గొంటారని, పి.శ్రీనివాసగౌడ్ పుస్తకసమీక్ష చేస్తారని తెలిపారు.


**విలేకర్లు కావలెను**

జిల్లాలో సీనియర్ జర్నలిస్ట్, గూడూరు శ్రీ కాళిదాస కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ గౌస్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న "సింహగర్జన" మాస పత్రికకు రాష్ట్ర వ్యాప్తంగా విలేకర్లు కావలెను. ఆసక్తిగలిగిన వారు ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

సెల్: 7095298746. ఫోన్: 08624 - 222786.

# తవ్వారు... వదిలేసారు



నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్ లైన్ల కోసం ఇష్టారాజ్యంగా తవ్వేసిన రోడ్లను వెంటనే పునర్నిర్మించాలని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీన ఆయన నెల్లూరురూరల్ 30వ డివిజన్ పరిధిలోని వెంకటరెడ్డినగర్‌లో ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరులో రోడ్లన్నింటిని ధ్వంసం చేసి పెట్టారు, కొద్దిపాటి వర్షాలకే రోడ్ల మధ్యలో కాలువలు కడుతున్నాయి. ఆ రోడ్ల మీద నడవాలన్నా, బండ్లు నడపాలన్నా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ రోడ్ల వద్ద కనీసం ప్రమాద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ విషయమై ఇప్పటికే మూడు సార్లు పబ్లిక్ హెల్త్ అధికారులతో మాట్లాడాను. ఇంతవరకు వాళ్లు స్పందించలేదు. ధ్వంసం చేసిన రోడ్లను పునర్నిర్మించకపోతే పబ్లిక్ హెల్త్ కార్యాలయానికి తాళాలు వేస్తానని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డినగర్‌లో మహాలక్ష్మి అమ్మవారి గుడి వద్ద, ఉప్పుటూరు దళితవాడ శ్మశానవాటికల వద్ద బోర్లకు ఆయన టెంకాయ కొట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికారప్రతినిధి బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ రామ్‌ప్రసాద్‌రెడ్డి, చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తం, యల్లయ్య ముదిరాజ్, నరసింహముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కమనీయం... శ్రీవారి కల్యాణం

## - విపిఆర్ దంపతుల సౌజన్యంతో ప్రత్యేక పూజలు



శ్రీవారి శ్రవణా నక్షత్రం, శ్రీ వైఖానసాచార్య జయంతిని పురస్కరించుకుని ప్రముఖ దాత, పారిశ్రామివేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతుల సౌజన్యంతో నెల్లూరు, గొలగమూడి రోడ్డులో ఉన్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం ఎంతో శోభాయమానంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను తిలకించి తరించారు. తొలుత, స్వామివారిని నగరంలోని శబరి శ్రీరామక్షేత్రం వద్ద నుంచి విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద విపిఆర్ దంపతులు భక్తిశ్రద్ధలతో స్వామివార్లను సాదరంగా ఆహ్వానించి పూజలు నిర్వహింపజేశారు. ఆ తర్వాత వైఖానసాగమోక్తంగా శ్రీవారికి అత్యంత వైభవంగా కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు స్వామివార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో అర్చకులు దేవి గోపాలకృష్ణమాచార్యులు, కందుకూరి వెంకటశేషాచార్యులు, వైఖానస సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉదయగిరి నరసింహాచార్యులు, కార్యదర్శి ఉదయగిరి శేషాచార్యులు, జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు పరాంకుశం ప్రసాదాచార్యులు, జిల్లా వైఖానస సంక్షేమ సంఘం యూత్‌ఫోరం అధ్యక్షులు పరాంకుశం కుమార్ భట్టాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఋణంతో రైతు రుణం తీర్చుకుందాం!



అన్నదాతను అన్ని విధాలా ఆదుకునేందుకు తమ బ్యాంకు ద్వారా కృషి చేస్తున్నామని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీన నెల్లూరులోని కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో జిల్లాలోని సహకార బ్యాంకు మేనేజర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టుకూరు మాట్లాడుతూ రైతులకు ఋణాలు మంజూరు చేయడంలో బ్యాంకు అధికారులు తమ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. రైతులకు పంట ఋణాలను, దీర్ఘకాలిక ఋణాలను వెంటనే అందించాలని చెప్పారు. రైతు వికాస్ పత్రం ద్వారా మెట్ట రైతులకు ఎకరాకు లక్ష చొప్పున, మాగాణి రైతులకు ఎకరాకు ఒకటిన్నర లక్ష చొప్పున అందించాలని సూచించారు. నాబార్డ్ ద్వారా పాడి పరిశ్రమకు ఎస్సీ, ఎస్టీలకైతే 33.33 శాతం సబ్సిడీతో, ఇతర రైతులకైతే 25శాతం సబ్సిడీతో ఋణాలను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. బ్యాంకు మేనేజర్లు గతంలో ఋణాల రికవరీ, డిపాజిట్‌ల లక్ష్యాలను సాధించాలన్నారు. రైతులకు ఎటువంటి ప్రయాస లేకుండా ఋణాలిచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు.

### మెట్టుకూరుకు అభినందన సత్కారం

సహకార బ్యాంకు ఉద్యోగులకు కూడా పింఛన్ సదుపాయాన్ని కల్పించినందుకు ఏ.పి కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రప్రథమంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులకు అన్ని రకాల ప్రయోజనాలను తన హయాంలోనే కల్పించినందుకు ఎంతో ఆనందంగా వుందన్నారు. ఉద్యోగులకు జీతాల అరియర్స్, పదోన్నతులతో పాటు పదవీ విరమణ వయసును 58 ఏళ్ల నుండి 60ఏళ్లకు పెంచామన్నారు. బ్యాంకుపై భారం పడినప్పటికీ ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేసామన్నారు. యూనియన్లు ఉద్యోగుల డిమాండ్ల కోసమే కాకుండా బ్యాంకు అభివృద్ధికి కూడా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బ్యాంకు ఉపాధ్యక్షులు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, సిఇఓ సరిత, డిసిఓ సుధాభారతి, ఓఎస్‌డి నాగశ్రీనివాస్, బ్యాంకు ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రత్నప్రసాద్, ప్రధానకార్యదర్శి వై.యస్.ఆర్.కె.ప్రసాద్, జిల్లా కార్యదర్శి దయాకర్‌రెడ్డి, అధ్యక్షుడు చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితుడికి చందూ చేయూత



నెల్లూరులోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సిద్ధార్ధ అనే బాలుడికి మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి వారు ఆర్థికసాయం అందజేశారు. ఈ బాలుడి గురించి తెలుసుకున్న సేవాసమితి వ్యవస్థాపకులు మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందూ) 12వ తేదీ వారింటికి వెళ్ళి సిద్ధార్ధను పరామర్శించి వైద్య చికిత్స నిమిత్తం వారి తల్లిదండ్రులు సుబ్బయ్య, వెంకటరమణమ్మ దంపతులకు ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్‌లో కూడా సిద్ధార్ధ వైద్యచికిత్సకు సాయం చేస్తామని ఈ సందర్భంగా మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందూ) తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు కమతం అశోక్, మనోజ్‌చౌదరి, సుధీర్, వినోద్, ఖాదర్, అవినాష్, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

# అజ్ఞానంలో నేటి యువత

## - జక్కా సౌదామిని వర్ధంతి సభలో గజల్ శ్రీనివాస్



ప్రముఖ పారిశ్రామికవేత్త, టౌన్‌హాల్ కమిటి కార్యదర్శి జె.యస్.రెడ్డి సతీమణి స్వర్గీయ జక్కా సౌదామిని వర్ధంతి నెల్లూరు టౌన్‌హాలులో జక్కా రంగారెడ్డి స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ గజల్ కళాకారుడు శ్రీనివాస్ ఆలపించిన పలు గీతాలు నెల్లూరీయుల మనస్సులను హత్తుకున్నాయి. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుకున్న యువత సైతం నేడు అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతోందని, వాస్తవాలను తెలుసుకుని సమసమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. తొలుత నిర్వాహకులు జె.యస్.రెడ్డి, మాజీఎమ్మెల్యే జె.కె.రెడ్డి కుటుంబసభ్యులతో కలసి సౌదామిని చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. గజల్ శ్రీనివాస్ కచేరి అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జె.కె.రెడ్డి సోదరి విజయమ్మ కుటుంబం క్యాన్సర్ ఆసుపత్రికి రూ.50వేలు విరాళాన్ని జె.ఎస్.రెడ్డి, గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా డా॥ లక్ష్మికి అందజేశారు.




## 'ప్రభా'తం

# యాత్రికులపై ఉగ్ర తూటా

**కాశ్మీర్ లోయలో మరోసారి ఉగ్రవాదోన్మాదులు చెలరేగిపోయారు. అభం శుభం ఎరుగని అమర్‌నాథ్ యాత్రీకులపై ఉగ్రవాదులు తూటాలు పేల్చి ఏడుగురి ప్రాణాలు బలిగొన్నారు. 15 ఏళ్ల క్రితం కూడా ఉగ్రవాదులు అమర్‌నాథ్ యాత్రీకులపై కాల్పులు జరిపి 8మందిని పొట్టనబెట్టుకున్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల ఘాతుకాలకు అంతే ఉండడం లేదు. ఉగ్రవాదుల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం కూడదని, కశ్మీర్ విషయంలో మీన మేషాలు లెక్కించకూడదని ఈ సంఘటన స్పష్టం చేస్తోంది.**

కాశ్మీర్ లోయలో మరోసారి ఉగ్రవాదోన్మాదులు చెలరేగిపోయారు. అభం శుభం ఎరుగని అమర్‌నాథ్ యాత్రికులపై తూటాలు పేల్చి పలువురి ప్రాణాలు బలిగొన్నారు. జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో అమర్‌నాథ్ యాత్రకు వెళ్తున్న ఒక బస్సుపై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఏడుగురు మృతిచెందారు. వీరిలో ఆరుగురు మహిళలు. మరో 32 మంది యాత్రికులు తీవ్రంగా గాయపడ్డారు.

అమరనాథ్ ఆలయాన్ని దర్శించుకుని బస్సు జమ్మూకు తిరిగివస్తుండగా మార్గమధ్యంలో ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. మృతిచెందినవారంతా గుజరాతీయులు. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి..చివరికి కొండల మధ్య ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. హిమాలయాల్లో హిమలింగంగా ఏర్పడే ఆ పరమేశ్వర రూపాన్ని కన్నులారా తిలకించి తిరిగివస్తుండగా, ఉగ్రవాదుల తూటాలకు బలై కన్ను మూశారు. అమానవీయమైన.. ఈ హేయమైన దాడితో.. ఉగ్రవాదులు నరరూప రాక్షసులేనని, లేశమాత్రం కూడా మానవత్వం వారికి ఏ కోశానా ఉండదనీ, వారికి ఎవరిపైనా ఎలాంటి దయ-కరుణ ఉండవనీ రుజువు చేసుకున్నారు. మృతుల కుటుంబాలు ఎంతగా విలవిలలాడిపోతున్నాయో..వారికే పట్టిదు.

2000వ సంవత్సరంలో కూడా ఉగ్రవాదులు అమరనాథ్ యాత్రికులపై కాల్పులు జరిపి 8 మంది ప్రాణాలను పొట్టనపెట్టుకున్నారు. ఎక్కడో పొంచి ఉండి విచక్షణరహితంగా కాల్పులు జరపడం, ఎవరికీ చిక్కకుండా పారిపోవడం ఉగ్రమూకలకు అలవాటై పోయింది. ఈ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల కిరాత కాలకు అంతే లేకుండా పోతోంది. కాశ్మీర్ రాజధాని అయిన శ్రీనగర్‌కు 142కిలోమీటర్ల దూరంలో భూమట్టానికి సుమారు 1400 అడుగుల ఎత్తున గుహల్లో వెలసిన పరమపవిత్రమైన అమరనాథ్ హిమ లింగాన్ని దర్శించుకోవడమంటే ఇక తమ జీవితాలు ధన్యమైనట్లేనని యాత్రికులు భావిస్తుంటారు. అందుకే, ఎంతో వ్యయప్రయాసలతోను, సాహసంతోనూ కూడినదైనప్పటికీ అమరనాథ్ యాత్ర చేయాలని ఎంతో భక్తితో ఎంతెంతో దూరప్రాంతాల నుంచి హిమాలయాలకు యాత్రికులు ఉత్సాహంగా వస్తుంటారు. అందులోనూ జులై-ఆగస్టు నెలల్లో దేశవ్యాప్తంగా ఎంతోమంది భక్తులు ఆ పరమశివుని హిమలింగాన్ని దర్శించుకునేందుకు తరలివెళ్తుంటారు. ఇదే అదనుగా ఉగ్రవాదులు ఆ దారుల్లో పొంచిఉండి ఆ యాత్రను భగ్నం చేయాలని దాడులు చేస్తుంటారు. ఎంతోమంది పెద్దలు, వృద్ధులు, మహిళలు ఎంతో ప్రయాసతో ఆ మంచుకొండల దారమ్మట ఎంతో భక్తితో శివనామ స్మరణలు చేసుకుంటూ ఆ భగవంతుని దర్శనం కోసం వెళ్తుంటే వారిని కూడా హతమార్చేందుకు ఉగ్రవాదులు సంకల్పించడం కంటే నీచాతినీచమైన విషయం మరొకటి ఉండదు.

ఉగ్రవాద విషసర్పాలకు విషం కక్కడం తప్ప మానవీయత ఉండదు. 15 ఏళ్ళ క్రితం కూడా ఇలాగే అమరనాథ్ యాత్రికులపై ఉగ్రవాదులు దాడులు చేశారు. అప్పుడు 8 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పటి నుంచి పోలీసులు, భద్రతా బలగాలు తమ ప్రాణాలొడ్డి ఆ ఉగ్రవాద ముష్కరమూకలను ఎదుర్కొంటూనే ఉన్నారు. అమరనాథ్ యాత్రకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తూనే ఉన్నారు. అయినా, ఎక్కడో ఒకచోట పొంచివున్న ఉగ్రవాదులు హటాత్తుగా వచ్చి విచక్షణారహి తంగా కాల్పులు జరపడం, పారిపోవడం చేస్తూనే ఉన్నారు. ఉగ్రవాది, హిజ్బుల్ ముజాహిదీన్ కమాండ్ బుర్హాన్‌వనీ వర్ధంతి పేరుతో ఉగ్రవాదులు హింసకు పాల్పడవచ్చని భద్రతాదళాలు రెండురోజులపాటు అమరనాథ్‌యాత్రను నిలిపేసి, సోమవారం మళ్ళీ ప్రారంభించారు. అయినా, ఉగ్రవాదులు ఆ రోజు కూడా ఈ దాడికి పాల్పడి యాత్రికుల ప్రాణాలు తీశారు.

'బస్సులో 57 మందిదాకా యాత్రికులున్నారు. అందులోనూ చిమ్మచీకట్లో వెళ్తున్న ఆ బస్సులోకి మూడు వైపులనుంచి తూటాలు దూసుకొచ్చాయ్.. అయితే, బస్సు డ్రైవర్ బస్సును ఆపకుండా ఎంతో సమయస్ఫూర్తితో, చాకచక్యంతో బస్సును వేగంగా నడిపాడు. భయపడి బస్సును నిలిపేసి ఉంటే మిగిలినవారమంతా బతికేవాళ్ళం కాదేమో'... అని బస్సులోని యాత్రికులు తమ ప్రత్యక్షానుభవాన్ని చెప్పున్నారు. అయిదుగురు ఉగ్రవాదులు మోటారు సైకిళ్ళపై వెంటాడి బస్సుపై కాల్పులు జరిపారని పోలీసులు భావిస్తున్నారు.

అయితే, రాత్రివేళ ఈ మార్గంలో ఎలాంటి వాహనాలు అనుమతి లేకుండా వెళ్ళకూడదని, బస్సు మార్గమధ్యంలో పంక్చరై ఒక గంట ఆలస్యం కావడం ఉగ్రవాదులకు అవకాశాన్నిచ్చినట్లయిందని భావిస్తున్నారు. మృతుల కుటుంబాలకు అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు గుజరాత్, జమ్ముకశ్మీర్ ప్రభుత్వాలతో పాటు అమరనాథ్ ఆలయం బోర్డు కూడా భారీగానే పరిహారం ప్రకటించాయి. అయినా, మృతుల కుటుంబాల వేదనా రోదనలు అర్చగలమా?.. తీర్చగలమా?... ఉగ్రవాదుల ఘాతుకాలతో అమరనాథ్ యాత్ర భక్తులకు మృత్యుయాత్రగా మారడంతో ఆయా కుటుంబాల ఆక్రందన వర్ణనాతీతం.

ఏదేమైనా జమ్ముకశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకా మీనమేషాలు లెక్కబెడుతూ ఉండడం ఎంతైనా విచారకరం. ప్రతి విషయాన్నీ కాలయాపన చేస్తూ పోతే ఫలితాలు దారుణంగానే ఉంటాయి. ఏమాత్రం జాప్యం లేకుండా ఉగ్రవాద ముష్కరులను ఏరివేస్తే తప్ప జమ్ముకశ్మీర్‌లో ప్రజలకు శాంతి ఉండదు. యాత్రికులకు భద్రతా ఉండదు. భద్రతాదళాలు, పోలీసులు తీసుకుంటున్న పటిష్టమైన చర్యల్లోనూ ఎలాంటి పొరపాట్లు, ఏమరుపాట్లు లేకుండా చూడాలి!

ఇకనైనా, ప్రభుత్వాలు కళ్ళు తెరచి చీకటిమాటున దాగి ఉండి అమాయకుల ప్రాణాలు తీస్తున్న ఉగ్రవాద హంతకమూకా చర్యలను నిరోధించాలి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలి. అందుకు అక్కడి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు, మేధావులు అందరూ కలసి ఖచ్చితమైన కార్యాచరణ పథకాన్ని రూపొందించి అమలు చేయాలి. కశ్మీర్‌లో శాంతి వెల్లివిరియాలి. ప్రజలంతా ఆనందంగా జీవించాలి. ఇదే అందరి తక్షణ కర్తవ్యం కావాలి.

## గాంధీ ఆశ్రమానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెస్తాం

### - ప్రముఖ కళాకారుడు గజల్ శ్రీనివాస్

పూజ్యబాపూజీ స్వహస్తాలతో ప్రారంభించిన పల్లిపాడులోని పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమానికి ప్రపంచ స్థాయి గుర్తింపును తెచ్చేందుకు కృషిచేస్తామని ప్రముఖ గజల్ కళాకారుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలోని ఈ ఆశ్రమాన్ని ఆయన ఈ నెల 8న సందర్శించి ఆశ్రమంలోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ 2న మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఈ ఆశ్రమంలో తాను నాల్గవ గిన్నిస్‌బుక్ రికార్డు సాధించేందుకు కృషిచేస్తానన్నారు. అక్టోబర్ 1,2 తేదీల్లో గాంధీజీ తత్వంపై అంతర్జాతీయ యువచైతన్య సదస్సును నిర్వహించనున్నామని, ఈ సదస్సుకు దేశవిదేశాల నుంచి సుమారు 4 వందల మంది విద్యార్థులు పాల్గొననున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ కన్వీనర్ గణేశం కృష్ణారెడ్డి, రెడ్‌క్రాస్ ఛైర్మెన్ డాక్టర్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, ఆశ్రమ కమిటీ సభ్యులు నేదురుమల్లి సుబ్బారెడ్డి, నారాయణ, ఆశ్రమ ప్రచారకమిటీ అధ్యక్షుడు శివరామయ్య, మహిళా అధ్యక్షురాలు గూడూరు లక్ష్మి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి ఎన్నికలోనూ రాజకీయమేనా?

### - కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి

రాష్ట్రపతి ఎన్నికలోనూ రాజకీయమేనా?..అంటూ కేంద్ర మాజీమంత్రి పనబాక లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రపతి ఎన్నికను కూడా కేంద్రంలోని అధికారపార్టీ రాజకీయం చేస్తోందని ఆమె విమర్శించారు. కులాలు మతాల మధ్య కుమ్ములాటలను ప్రోత్సహిస్తూ రాష్ట్రపతి ఎన్నికను రాజకీయచట్రంలోకి తీసుకురావడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 7న నెల్లూరులోని ఇందిరాకాంగ్రెస్ భవన్‌లో జరిగిన ఎస్సీ-ఎస్టీ, మహిళాకాంగ్రెస్ జిల్లాస్థాయి సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రపతి ఎన్నికల బరిలో వున్న మీరా కుమార్‌కు అన్నివర్గాలవారు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అధికారపక్ష పార్టీకి అమ్ముడుపోయారని, ప్రతిపక్షనాయకుడైన జగన్ మైనార్టీల, దళితుల ఆశలను వమ్ముచేశారని అంటూ ఇలాంటి నేతలను ప్రజలు నమ్మవద్దన్నారు. అన్ని కులాలు, అన్ని మతాలను గౌరవించే కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రపతి అభ్యర్థికి అందరూ మద్దతు పలకాలని ఆమె అభ్యర్థించారు. డిసిసి అధ్యక్షులు పనబాక కృష్ణయ్య అధ్యక్షత వహించిన ఈ సదస్సులో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్. పద్మశ్రీ, ఎస్సీ విభాగం రాష్ట్ర ఛైర్‌పర్సన్ వినయ్‌కుమార్‌లతో పాటు, కాంగ్రెస్ సీనియర్




నేతలు సివి శేషారెడ్డి, దేవకుమార్‌రెడ్డి, చెంచలబాబుయాదవ్, రఘురామ్ ముదిరాజ్, సీతారామ్‌బాబు, రమణయ్య, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు అనూరాధారెడ్డి, ఎస్సీఎస్టీ విభాగాల అధ్యక్షులు తిరుపతయ్య, రమణయ్య, మైనార్టీ నాయకులు జహంగీర్, నాయకులు బాలసుధాకర్, ఫయాజ్, శివాచారి, శివప్రసాద్, భవానీ నాగేంద్రప్రసాద్, లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల మీద ఆటలా?

నెల్లూరు నగరంలో కొన్ని అల్లరిమూకలు రోడ్ల మీదే క్రికెట్, ఫుట్‌బాల్, కాట్‌బాల్ వంటి ఆటలు ఆడుతున్నాయి. రోడ్ల మీద ఆటలేంటి, దారిన పోయేవారికి ఇబ్బంది కదా అని చెప్పినవారిని ఈ అల్లరిమూకలు తిడుతుంటాయి. రోడ్లమీద ఆటల వల్ల వాహనాలలో వెళ్ళే వాళ్ళు చాలా ఇబ్బంది పడుతున్నారు. కాట్‌బాల్ వల్ల రాళ్ళు తగిలి కళ్లు దెబ్బతిన్నవాళ్ళు, క్రికెట్ బాల్ తగిలి గాయపడ్డవాళ్ళు కూడా ఉన్నారు. ఇటీవల విజయవాడలో ఇలాంటి ఘటనే హత్యకు దారి తీసింది. అలాగే కొన్ని సాంఘిక కార్యక్రమాలప్పుడు పోలీసుల అనుమతి లేకుండానే బాణాసంచా కాలుస్తున్నారు. దీనివల్ల అగ్ని ప్రమాదాలు తలెత్తుతున్నాయి. అధికారులు వీటిపై చర్యలు తీసుకోవాలి.

- బాధితులు, నెల్లూరు.

## ఎయిర్ ఇండియా కష్టాలు

64ఏళ్ల క్రితం ఎయిర్ ఇండియా విమానయాన సంస్థ కార్పొరేషన్ యాక్ట్ క్రింద జాతీయ విమానయాన సంస్థగా రూపొందింది. స్వాతంత్ర్యానికి పూర్వం ఇది టాటా ఎయిర్ లైన్స్‌గా వుండేది. ఆ తర్వాత ఇండియన్ ఎయిర్ లైన్స్ ఏర్పడింది. ఇండియన్ ఎయిర్ లైన్స్ డొమెస్టిక్ సేవలందించగా, ఎయిర్ ఇండియా అంతర్జాతీయ సేవలందిస్తోంది. ఈ సంస్థలో 25వేల మంది సిబ్బంది పని చేస్తున్నారు. ఈ సంస్థ ఆపరేషన్ సామర్థ్యం బాగుండడం వల్ల మెరుగైన సేవలు అందించి ప్రయాణీకుల ఆదరాభిమానాలు పొందింది. ప్రస్తుతం విమానయాన సంస్థల మధ్య పోటీ గట్టిగావున్నప్పటికీ 50వేల కోట్ల నష్టం భరిస్తూనే ఈ సంస్థను నడుపుతూ వచ్చారు. ఈ సంస్థను మళ్ళీ ప్రైవేట్ పరం చేయాలని చూడడం బాధాకరం. భగవంతుడు ఎయిర్ ఇండియా సంస్థను కాపాడాలని ప్రార్థిస్తున్నాం.

రావూరి సురేంద్రనాథ్, మాజీ ట్రాఫిక్ అసిస్టెంట్, ఎయిర్ ఇండియా, నెల్లూరు.

## దమ్మున్న ప్రధాని మోడీ




ప్రపంచంలోనే చేవ, దమ్ము బలం వున్న దేశం ఇజ్రాయిల్. ఆ దేశానికి పోవడానికి మన గత ప్రధానులెవరికీ దమ్ము చాలలేదు. ధీరుడు నరేంద్ర మోడీ 70ఏళ్ల సంకెళ్లను తెంచాడు. ఇజ్రాయిల్ పర్యటనతో చారిత్రక సంబంధాలకు తెరతీసాడు. వ్యవసాయ, సాంకేతిక, సైనిక రంగాలలో ఇజ్రాయిల్ సహకారం మనకు ఎంతైనా అవసరం. మన చుట్టూ ఉన్న ఉగ్రదేశాలను ఎదుర్కోవడానికి ఆ దేశంతో మైత్రి ఎంతైనా అవసరం.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

# సినీ పరిశ్రమకు...
# అనువైన వేదిక నెల్లూరు!









కేసీఆర్ ఛీ... ఛా... అని ఛీదరించుకుని ఉమ్మేసినా కొందరు సినీ ప్రముఖులు హైదరాబాద్‌ను వదిలేది లేదంటున్నారు. ఇలాంటి వాళ్లది సినీ పరిశ్రమపై ప్రేమ కాదు! అక్కడ పోగేసిన వేలకోట్ల ఆస్తులపై ప్రేమ. అవెక్కడ పోతాయోననే బాధ. అక్కడ నుండి సినీ పరిశ్రమను ఎత్తేస్తే తమ ఆస్తుల విలువ పడిపోతుందని వారి భయం. రాష్ట్ర విభజన అనంతర పరిస్థితుల్లో కొందరు సినిమావాళ్లు సినీ పరిశ్రమను హైదరాబాద్ నుండి ఏపికి తరలించాలని డిమాండ్ చేశారు. అయితే హైదరాబాద్‌లో వేల కోట్ల ఆస్తులు పోగేసిన ఇద్దరు సినీ ప్రముఖులు మాత్రం ఆరునూరైనా హైదరాబాద్ నుండి సినీ పరిశ్రమను తరలించేది లేదంటూ స్టేట్ మెంట్లిచ్చారు. కేసీఆర్ అమాయకుడేం కాదు. విభజన ఉద్యమాలప్పుడు అక్కడున్న ఏపి ఉద్యోగులను వెళ్లగొట్టాడు. వ్యాపారస్థులకు పొగపెట్టాడు. కాని సినీపరిశ్రమ జోలికెళ్లలేదు సరికదా, 2వేల ఎకరాలలో సినీనగర్ కట్టిస్తానని హామీ కూడా ఇచ్చాడు. అతనికి తెలుసు... సినిమా గ్లామర్ ఫీల్డ్. హైదరాబాద్ అభివృద్ధిలో దానిపాత్ర అపరిమితం. 99శాతం సినిమా ఫీల్డ్‌లో ఉండేవాళ్లు ఆంధ్రావాళ్లే! వీళ్లంతా అనుకుంటే సినీపరిశ్రమను హైదరాబాద్ నుండి లాక్కొచ్చేయడం పెద్ద సమస్య కాదు. కానీ వాళ్లే హైదరాబాద్‌ను వదిలిరారు.

సినిమా పరిశ్రమలో పెద్దోళ్లకు లేకపోయినా చిన్నస్థాయి నటులు, నిర్మాతలకు ఏపిపై గాలిమళ్లింది. సినిమా పరిశ్రమను అంచెలంచెలుగా ఏపికి అందులోనూ సినిమాల నిర్మాణానికి అన్ని అవకాశాలున్న నెల్లూరు జిల్లాకు తీసుకురావాలనే అభిప్రాయం ఏర్పడింది. నెల్లూరుజిల్లా సినిమా షూటింగ్‌లకు బాగా అనుకూలమంటూ పలువురు సినీ పరిశ్రమ వ్యక్తులు ఇటీవల ప్రకటించివున్నారు కూడా! రాష్ట్ర విభజన తర్వాత ప్రముఖ నిర్మాత డి.సురేష్‌బాబు నెల్లూరుజిల్లా సినిమా పరిశ్రమకు చాలా అనుకూలమని, పరిశ్రమను అక్కడకు తరలించడానికి కృషి చేయాలంటూ పిలుపునిచ్చారు. అంతేగాక నెల్లూరుజిల్లా సరిహద్దులోని తడ ప్రాంతంలో స్టూడియో నిర్మాణానికి కూడా ఆయన ఆలోచన చేశారు.

తెలుగు సినీ పరిశ్రమను ఈరోజు కాకున్నా రేపైనా హైదరాబాద్ నుండి తరలించక తప్పదు. ఏపి వాళ్ళు హైదరాబాద్‌లో వుండి సినిమాలు తీసినంత కాలం తెలంగాణను అభివృద్ధి చేయడం తప్ప ఏపికి ఏమీ ఒరగదు. ఇకముందు హైదరాబాద్‌లో సినిమాలు తీయాలన్నా భారీ బడ్జెట్ వుంటే తప్పితే చిన్న సినిమాలు తీయలేరు. నెల్లూరుజిల్లాలో తక్కువ బడ్జెట్‌తో సినిమాలు పూర్తి చేసే అవకాశాలున్నాయి. మనకు పక్కనే చెన్నై వుంది. సినిమా నిర్మాణానికి కావాల్సిన ఎక్విప్‌మెంట్స్, స్టూడియోలు, థియేటర్లు అన్నీ వున్నాయి. కాబట్టి నెల్లూరుజిల్లాలో ఇప్పటికిప్పుడు వీటిని ప్రత్యేకంగా నిర్మించాల్సిన అవసరం లేదు. చెన్నైలోనే అవసరమైన సినీ సాంకేతిక సిబ్బంది వున్నారు. ఇక నెల్లూరు జిల్లాలో షూటింగ్స్‌కు అవసరమైన సముద్ర తీరప్రాంతం, పోర్టులు, రైల్వేలైన్‌లు, కొండలు, లోయలు, ప్రకృతి సౌందర్యాలు, పల్లె సీమలు... ఇలా అన్నీ అందుబాటులో వున్నాయి. చెన్నై - నెల్లూరుల మధ్య తడను ప్రధాన కేంద్రంగా చేసుకుంటే నెల్లూరు, చిత్తూరు జిల్లాలతో పాటు తమిళనాడులోని లొకేషన్లను కూడా సినిమా షూటింగ్‌లకు వాడుకోవచ్చు. ఇలా సినీ పరిశ్రమకు ఎంతో అనువైన నెల్లూరుజిల్లాలో సినీ పరిశ్రమను నెలకొల్పాలన్న ఆలోచనకు ప్రభుత్వం కూడా సహకరిస్తే ఆ కల సాకారం కావచ్చు.

## సినీపరిశ్రమ అభివృద్ధికి చేయూతనివ్వాలి - నెల్లూరుజిల్లా కలెక్టర్‌కు సినీ హీరో భానుచందర్ వినతి



నెల్లూరులో సినీపరిశ్రమ అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వపరంగా చేయూతనివ్వాలని సినీహీరో భానుచందర్, హీరోయిన్ అర్చన, సిక్కా సభ్యులు ఈ నెల 7వ తేదీ నెల్లూరు జిల్లా కలెక్టర్ ముత్యాలరాజును కోరారు. ఈమేరకు సౌత్ ఇండియన్ సినీ కల్చరల్ అసోసియేషన్(సిక్కా) ఆధ్వర్యంలో కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్‌ను కలిసి చర్చించారు. వెంకటాచలం మండలం కేంద్రానికి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డులో భారీ సినీక్లబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో ఫిల్మ్‌సిటీకి సంబంధించిన పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. జిల్లాలో సినిమాలు షూటింగ్ చేసేందుకు ఆహ్లాదకరమైన పర్యాటక ప్రాంతాలు, పోర్టు పరిశ్రమలు, బీచ్‌లున్నాయన్నారు. అందువల్ల ఇక్కడ ఫిల్మ్ సిటీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సినీ పరిశ్రమకు చేయూతనిస్తామన్నారు. సిక్కా ఛైర్మెన్ ప్రొఫెసర్ పి.ఎస్.రెడ్డి, గౌరవాధ్యక్షుడు, ప్రముఖ సినీ దర్శకుడు పి.చంద్రశేఖర్‌రెడ్డి, సిక్కా ఉపాధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, ఇ.సి మెంబర్ ద్రోణాదుల వెంకట్రావు, మీడియా మేనేజర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.









# సిటింగ్‌లకు...
# కటింగ్ వేస్తాడా?


**రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని తెలుగుదేశం పార్టీ సిటింగ్ ఎమ్మెల్యేలకు చంద్రబాబు తిరిగి సీట్లు ఇవ్వడనే ప్రచారం జోరుగా వుంది. ఒక్క సిటింగ్ స్థానాలలోనే కాదు, జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుండి కొత్త అభ్యర్థులను రంగంలోకి దించుతారని టాక్!**

ముఖ్యంగా పార్టీకి జిల్లాలో వైసిపి నుండి జంప్ చేసొచ్చిన గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌ను లెక్కలోకి తీసుకుంటే నలుగురు ఎమ్మెల్యేలున్నారు. అసలు గూడూరు సీటును సునీల్‌కు ఇవ్వడమే పెద్ద సందేహం. సునీల్ వైసిపి నుండి వచ్చాక పార్టీ ఎమ్మెల్యేల లెక్క పెరిగిందనేగాని పార్టీకి ఇక్కడ అదనంగా ఒరిగిందేమీలేదు. వైసిపి నుండి ఆయన వెంట పెద్దగా వచ్చినవాళ్లు లేరు. అంతేకాదు, పార్టీలోనే కుమ్ములాటలు ఎక్కువయ్యాయి. పార్టీలో చేర్చుకునేటప్పుడు సునీల్‌కు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ గ్యారంటీ ఇచ్చి ఉంటారు. కాని, అభ్యర్థి ఓడిపోతాడని రిపోర్ట్ వస్తే మాత్రం చంద్రబాబు మాటకంటే కూడా సర్వే రిపోర్ట్‌కే ఎక్కువ ప్రాధాన్యత నిస్తాడు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వరుసగా రెండోసారి ఎమ్మెల్యే అయ్యాడు. అయితే గతంలో ఎప్పుడూ లేనంతగా ఈసారి ఆయనపై ఆరోపణలొచ్చాయి. ప్రజల్లోనూ వ్యతిరేకత వచ్చింది. పార్టీ నాయకులలో కూడా కొంతమందికి ఆయనంటే పడడం లేదు. ఈసారి ఆయనను మార్చవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. ఉదయగిరి ఎమ్మెల్యే బొల్లినేని రామారావు విషయానికొస్తే ఎటువంటి అవినీతి ఆరోపణలు గాని, వివాదాలు గాని లేవు. కాకపోతే జనంలో ఉండడం లేదంతే! ఉదయగిరి ప్రజలు ఎమ్మెల్యే తమ మధ్య వుండాలని, తమ ఇంట్లో పెళ్లయినా, చావైనా రావాలని కోరుకుంటారు. అప్పట్లో వెంకయ్యనాయుడు నుండి కంభం విజయరామిరెడ్డి, మాదాల జానకిరామ్, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిల దాకా ఇక్కడ ఎమ్మెల్యేలుగా పని చేసిన వాళ్లందరూ అలా అలవాటు చేసి పెట్టారు మరి! వాళ్లంతా ఫుల్‌టైం పొలిటీషియన్స్ కావడంతో ఆ విధంగా ఉండగలిగారు. కాని బొల్లినేని రామారావు పరిస్థితి అది కాదు. మహారాష్ట్రలో పేరు మోసిన కాంట్రాక్టర్. సీఎం తన నియోజకవర్గానికొచ్చినా ఆయన రాలేనంత బిజీ! వారానికొకసారి వస్తాడు. కలిగిరిలోని తన ఆఫీసులో కూర్చుంటాడు. అన్ని మండలాల నుండి నాయకులను పిలిపించుకుని మాట్లాడతాడు. అతని నాయకత్వంలో మండలస్థాయి నాయకులు హ్యాపీగానే వున్నారు. అతనిని ఎవరూ వ్యతిరేకించడం లేదు. కాకపోతే ప్రజల్లో లేడనే వ్యతిరేకత వుంది. ఉదయగిరికి ఈసారి బొల్లినేని కాదనుకుంటే కంభం విజయరామిరెడ్డి రేసులో వున్నాడు. బొల్లినేని కూడా ఈసారి చంద్రబాబు నిలబడమంటేనే పోటీకి దిగేటట్లున్నాడు తప్పితే సీటు నాకే కావాలని గట్టిగా పట్టుపట్టకపోవచ్చు. కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఈసారి సీటును డైలమాలో పెట్టేటట్లున్నారు. నియోజకవర్గంలో వర్గపోరు తీవ్రంగా వుంది. 2014 ఎన్నికల్లో సీటు ఆశించి నిరాశ చెందిన పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి ఈసారి సీటు కోసం గట్టి ప్రయత్నమే చేస్తున్నాడు. మరి ఆయన ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలి. మొత్తానికి సిటింగ్ ఎమ్మెల్యేలు నలుగురిలో ఎవ్వరికీ సీటు గ్యారంటీ లేదు.

# ప్లీనరీలో గర్జించిన నెల్లూరు గొంతుకలు









ఈనెల 8, 9 తేదీలలో గుంటూరులో జరిగిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్లీనరీకి నెల్లూరుజిల్లా నుండి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నెల్లూరు జిల్లాకు 3వేల పాస్‌లు ఇచ్చినా కార్యకర్తలు అంతకుమించి వెళ్లారు. ఇల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాలలోని 46మండలాల నుండి కార్యకర్తలు తరలివెళ్లడం జరిగింది.

రెండురోజుల ప్లీనరీలో జిల్లా వైకాపా నేతలు తమ గొంతు విప్పారు. ప్రభుత్వంపై పదునైన విమర్శలతో ఆకట్టుకున్నారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రసంగం కార్యకర్తలను ఉర్రూతలూగించింది. అతను మాట్లాడింది 5నిముషాలే అయినా... ఆ కొద్దిసేపు ఒక సునామీ వచ్చిపోయినట్లైంది. రాయలసీమ పౌరుషానికి పురిటిగడ్డ. ఎందరో మహనీయులకు జన్మనిచ్చిన నేల నంద్యాల! నల్లమల అడవుల్లో వుండి 10వేల మంది బ్రిటీష్ సైన్యాన్ని గడగడలాడించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నంద్యాల వాడే! గాంధీజీతో కలిసి ఉప్పుసత్యాగ్రహం చేసింది ఇక్కడి మహానుభావులే! కరువు కాటకాలలో కూడా నంద్యాల ప్రజలను ఆదుకుని విక్టోరియా మహారాణి నుండి బంగారు పతకం అందుకున్న వెంగళరెడ్డి కూడా నంద్యాల వాడే! కృష్ణదేవరాయలు పాలించిన నేల ఇది. ఇలాంటి పౌరుషాల ప్రాంతంలోకి వచ్చి చంద్రబాబు ప్రజలకు దండం పెట్టి ఓట్లు అడగాలేగాని, నేనేసిన రోడ్లపై నడవాలంటే ఓట్లేయాలంటాడా? ప్రజలారా... నంద్యాల పౌరుషమేంటో రేపటి ఎన్నికల్లో చంద్రబాబుకు రుచి చూపండంటూ ఆయన ఘాటుగా మాట్లాడారు. అలాగే, వచ్చే ఎన్నికల్లో గెలుస్తామనుకున్న వారికే టిక్కెట్లు ఇవ్వాలని ఆయన నినదించారు. ప్రజల్లో తనకు బలం లేదని, తాను ఓడిపోతానని రిపోర్ట్ వస్తే తనకు కూడా టిక్కెట్ ఇవ్వొద్దని, ప్రతిఒక్కరికీ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలుపే లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. అతి విశ్వాసంతో కాకుండా ఆత్మవిశ్వాసంతో పనిచేద్దామని చెప్పారు. నంద్యాల ఉపఎన్నికల్లో వైకాపా గెలుపును ఎవరూ ఆపలేరని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని, పేద ప్రజలకు అవి అందుబాటులో లేకుండా పోయాయని ఆయన చెప్పారు.

నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్ యాదవ్ ప్రభుత్వం మీద, ముఖ్యమంత్రి చంద్రబాబు మీద తనదైన శైలిలో రెచ్చిపోయాడు. చంద్రబాబు మోసానికి కేరాఫ్ అడ్రస్‌గా మారాడని, ఎన్నికలప్పుడు ఆయనిచ్చిన 600హామీలలో 6హామీలను కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని ధ్వజమెత్తాడు. వై.యస్.రాజశేఖరరెడ్డి పరిపాలనతో ప్రజల్లో రాజకీయ నాయకులంటే గౌరవం పెరిగిందని, చంద్రబాబు వచ్చాక అది మళ్ళీ మంట కలిసిందన్నాడు. ఆటల్లో గెలిచిన వారికి నోబుల్ ప్రైజులు ఇస్తామని, మద్యం బాగా తాగాలని రకరకాలుగా మాట్లాడుతున్న చంద్రబాబుకు పిచ్చి పట్టినట్లుగా వుందని, ఆయనను డాక్టర్లకు చూపించాలని సలహా ఇచ్చాడు.

సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైకాపా అధికారంలోకి రాగానే స్థానిక సంస్థలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జన్మభూమి కమిటీలను పెట్టి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు.

ఇంకా ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, మేకపాటి గౌతమ్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, ఎల్లసిరి గోపాలరెడ్డి తదితరులు ప్లీనరీలో పాల్గొని పలు అంశాలపై మాట్లాడారు.

# గురువులకు సత్కారం



ఈ నెల 9న గురు పూర్ణిమ సందర్భంగా నెల్లూరు ఇస్కాన్ మందిరం రోడ్డులో వున్న రత్నం నీట్ కోచింగ్(అమరావతి) క్యాంపస్ నందు గురువులను సత్కరించారు. రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నం, రసాయన శాస్త్ర అధ్యాపకులు కోరా సార్‌లను సహచర అధ్యాపకులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలు, బొకేలతో సత్కరించారు. ఈ సందర్భంగా కె.వి.రత్నం మాట్లాడుతూ అధ్యాపక వృత్తి ఎంతో పవిత్రమైందని, ఈ వృత్తి ద్వారా ఎన్నో లక్షల మంది ఇంజనీర్లను, డాక్టర్లను తీర్చిదిద్దడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. తన జీవితాన్ని విద్యార్థుల భవిష్యత్ కోసం, మంచి విద్య కోసం అంకితం చేస్తానన్నారు. క్రమశిక్షణకు, ఉత్తమ బోధనకు రత్నం విద్యాసంస్థలు శాశ్వత చిరునామాగా నిలిచిపోతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### బులియన్ మర్చంట్స్ ఎన్నికల్లో...

## ఏఎంఆర్‌దే గెలుపు

నెల్లూరులో అసెంబ్లీ ఎన్నికలను తలపించే రీతిలో జరిగిన 'ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చెంట్స్ అండ్ పాన్‌బ్రోకర్స్ అసోసియేషన్' ఎన్నికల్లో అమరా మోహన్‌రావు ప్యానెల్ విజయం సాధించింది. అసోసియేషన్ మాజీఅధ్యక్షులు అమరా మోహన్‌రావు, దర్శి సురేష్‌బాబుల ప్యానెళ్లు ఈ ఎన్నికల్లో హోరాహోరీగా తలపడ్డాయి. ఇరు ప్యానెల్‌లలో వున్న అభ్యర్థులు ఉధృతంగా ప్రచారం నిర్వహించారు. రెండు ప్యానెల్‌ల సభ్యులు, స్వతంత్రులు కలిపి 29సభ్యుల స్థానాలకు 62మంది పోటీపడ్డారు. 9వ తేదీ నెల్లూరు రంగనాయకులపేటలోని అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. 423మంది సభ్యులకు గాను 411మంది ఓట్లేసారు. సాయంత్రం ఓట్లు లెక్కపెట్టగా అమరా మోహన్‌రావు ప్యానెల్ నుండి 17మంది, దర్శి సురేష్‌బాబు ప్యానెల్ నుండి 10మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. ఇంకో ఇద్దరు స్వతంత్రసభ్యులుగా గెలిచారు. కాగా, కొత్తగా ఏర్పడ్డ కార్యవర్గానికి అమరా మోహన్‌రావును అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ అసోసియేషన్‌కు మోహన్‌రావు అధ్యక్షుడు కావడం ఇది ఏడవసారి. అలాగే ప్రధాన కార్యదర్శిగా మెట్టా ప్రసన్నాంజనేయులు, కోశాధికారిగా కొనగళ్ళ శోభన్‌బాబును ఎన్నుకున్నారు. మిగతా కమిటీ పదవులకు కూడా సభ్యులను ఎన్నుకున్నారు.

## సూక్ష్మ స్వర్ణకారుడు ముసవ్వీర్ వరల్డ్ రికార్డ్



నెల్లూరు జెండావీధికి చెందిన సూక్ష్మ స్వర్ణకారుడు డా॥ షేక్ ముసవ్వీర్ మరో వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నాడు. సామాజిక, ఆధ్యాత్మిక, క్రీడా, తదితర రంగాలకు సంబంధించి 19 గ్రాముల బంగారంతో 50సూక్ష్మ స్వర్ణ నమూనాలను తీర్చిదిద్దిన నేపథ్యంలో వజ్ర వరల్డ్ రికార్డ్ నిర్వాహకుడు తిరుపతిరావు రికార్డును కొరియర్ ద్వారా పంపారని ముసవ్వీర్ తెలిపాడు.

## నిజాయితీపరుడు వాసు



రోడ్డు మీద రూపాయి పడితే గుట్టుచప్పుడు కాకుండా నొక్కేసే ఈ రోజుల్లో క్రింద పడ్డ పర్సును నిజాయితీగా పోలీసు అధికారులకు అందజేసాడు ఓ నిజాయితీ పరుడు. వివరాల్లో వస్తే నెల్లూరుజిల్లా పోలీసు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వాసు మూలాపేట మీదుగా వస్తుంటే రోడ్డుమీద పర్సు కనపడింది. అందులో రూ.6వేల నగదు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు ఉన్నాయి. వెంటనే ఆ పర్సును జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎఎస్పీ శరత్‌బాబుకు అందజేశారు. పర్సు పోగొట్టుకున్న బాధితుడు రాజీవ్ అనే విద్యార్థిని పిలిపించి ఎఎస్పీ శరత్‌బాబు చేతులమీదుగా బాధితునికి అందజేశారు. నిజాయితీగా పర్సును అందజేసిన వాసును అడిషనల్ ఎస్పీ అభినందించారు. మినిస్ట్రియల్ అసోసియేషన్ సభ్యుడు బిల్లా మస్తాన్‌రావు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## అర్ధాంతరంగా తిరిగొచ్చిన సోమిరెడ్డి



ఈ నెల 5వ తేదీన సింగపూర్, ఫిలిప్పీన్స్‌ల పర్యటనకు వెళ్లిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి షెడ్యూల్ ప్రకారం పర్యటన పూర్తి కాకుండానే వెనుదిరిగి వచ్చారు. ఆయన 11వ తేదీ వరకు విదేశీ పర్యటనలో వుండాలి. ఆరోజు చెన్నైకి రావాలి. కాని వ్యక్తిగత కారణాలతో ఆయన 8వ తేదీనే ఇండియాకు తిరిగొచ్చేసారు.

### ఎస్సీ కార్పొరేషన్

## ఇ.డిగా అంబేద్కర్

ఎస్సీ కార్పొరేషన్ ఇ.డిగా బి.ఆర్. అంబేద్కర్ ఈ నెల 7వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ ఆర్డీవోగా పని చేస్తూ డిప్యూటేషన్‌పై ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. కృష్ణాజిల్లా గుడివాడకు చెందిన అంబేద్కర్ 2007లో గ్రూప్-1కు సెలక్ట్ అయ్యారు. శిక్షణ తర్వాత 2009లో అదిలాబాద్ జిల్లా మంచిర్యాల ఆర్డీఓగా పనిచేశారు. ఆ తర్వాత విజయనగరం జిల్లా పార్వతీపురం ఆర్డీవోగా పనిచేశారు. ఆ తర్వాత ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారిగా పని చేసారు. ప్రస్తుతం కాకినాడ ఆర్డీఓగా వుంటూ నెల్లూరుకు బదిలీ అయ్యారు.

### నెల్లూరు ట్రాన్స్‌కో

## ఎస్ఇగా విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు విద్యుత్‌శాఖ ఎస్ఇగా కె.విజయకుమార్‌రెడ్డిని నియమించారు. 11వ తేదీ ఆయన బాధ్యతలు కూడా స్వీకరించారు. ఇటీవలకాలం వరకు ఆయన నెల్లూరు రూరల్ డి.ఇగా పనిచేస్తూ తిరుపతి కార్పొరేట్ కార్యాలయంకు టెక్నికల్ డి.ఇగా బదిలీ అయ్యారు. ఆయనకు ఎస్.ఇగా పదోన్నతి కల్పిస్తూ నెల్లూరుకు బదిలీ చేశారు. ఇక్కడ ఎస్.ఇగా వున్న కళాధర్ రావును తిరుపతి జనరల్ మేనేజర్ ప్లానింగ్ సెక్షన్‌కు బదిలీ చేశారు.

## శంకరమఠంలో చండీహోమం

నెల్లూరు మూలాపేటలో వున్న శంకర మఠంలో ఈనెల 8న ఎంతో భక్తి శ్రద్ధలతో చండీ హోమాన్ని నిర్వహించారు. కంచి కామకోటి పీఠానికి చెందిన వేదపండితుడు సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉభయకర్తలుగా గూడ శ్రీనివాసమూర్తి దంపతులు వ్యవహరించారు. శంకరమఠం మేనేజర్‌తో పాటు, నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు, ఆంజనేయులు, శివకుమార్ పాల్గొన్నారు.


ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


## కైలాస శ్రీనివాసులుకు డాక్టరేట్



నెల్లూరు ఆకుతోట హరిజనవాడకు చెందిన కైలాస శ్రీనివాసులుకు వాణిజ్య శాస్త్ర విభాగంలో (కామర్స్ డిపార్ట్‌మెంట్) తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. కావలి పి.జి. సెంటర్ ప్రత్యేక అధికారి ఆచార్య పి.వెంకటరావు పర్యవేక్షణలో "ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో వ్యవసాయ రంగానికి విత్తాన్ని సమకూర్చుటలో వాణిజ్య బ్యాంకుల పాత్ర" అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. వాకాడు మండలం బాలిరెడ్డిపాళెంలోని జడ్పీ పాఠశాలలో శ్రీనివాసులు ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

## అసాంఘిక శక్తుల భరతం పడతా!

### - రూరల్ డిఎస్పీ రాఘవరెడ్డి



అసాంఘిక శక్తుల భరతం పట్టి వారి ఆట కట్టిస్తానని, అందరి సహకారంతో శాంతి భద్రతల విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకుంటానని కొత్తగా బాధ్యతలు చేపట్టిన నెల్లూరు రూరల్ డిఎస్పీ రాఘవరెడ్డి అన్నారు. నగరంలోని రూరల్ డిఎస్పీ కార్యాలయంలో ఆయన ఈనెల 8న బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రూరల్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాగా, ఈ స్థానం నుంచి బదిలీ అయిన తిరుమలేశ్వరరెడ్డి ఈ సందర్భంగా కొత్త డిఎస్పీని కలిసి తన అభినందనలు తెలిపారు. కొత్త 1989 బ్యాచ్‌కి చెందిన డిఎస్పీ రాఘవరెడ్డి కడపజిల్లా వాసి. గతంలో చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఎస్ఐగా పనిచేసి, 2000వ సంవత్సరంలో సిఐగా పదోన్నతి పొంది ట్రాన్స్‌కో విజిలెన్స్‌లోను, అనంతపురం ఒన్‌టౌన్‌లోనూ విధులు నిర్వహించారు. 2011లో డిఎస్పీగా పదోన్నతి పొంది మదనపల్లి, కర్నూలుల్లో పనిచేశారు. కొత్త డిఎస్పీ రాఘవరెడ్డికి 'లాయర్' శుభాకాంక్షలు.

### చిల్డ్రన్స్ పార్కులో...

## ఉల్లాసంగా 'హ్యాపీ సండే'



ప్రతిరోజూ పని వత్తిడితో తీరిక లేకుండా వృత్తి వ్యాపారాల్లో నిమగ్నమై వుండే అనేక మంది నగరవాసులు ఆదివారం హాయిగా తమ కుటుంబ సభ్యులు, పిల్లలతో చిల్డ్రన్స్ పార్క్‌కు వచ్చి సేదదీరారు. చిన్నారులతో పాటు ఎంచక్కా ఉత్సాహంగా ఆడుతూ పాడుతూ కేరింతలు కొట్టారు. ప్రత్యేకించి డిజె మ్యూజిక్‌తో అంతా సందడి నెలకొంది. అందరూ ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. మ్యూజికల్ ఛైర్ తదితర క్రీడలతో ఆనందంగా గడిపారు. ఎంతో కోలాహలంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న జరిగిన ఈ 'హ్యాపీ సండే' కార్యక్రమానికి సందర్శకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు మాట్లాడుతూ, నగరప్రజలందరూ ప్రతి ఆదివారం ఇలాగే కుటుంబసభ్యులతో చిల్డ్రన్స్‌పార్క్‌కు విచ్చేసి ఆనందంగా గడపాలని కోరారు. కార్పొరేటర్ జానకి, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ అనూరాధ, ఇ.ఇ జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు. మళ్ళీ ఆదివారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో 'హ్యాపీ సండే' కార్యక్రమం ఉంటుందని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు. యాంకర్‌గా టి.వి ఆర్టిస్ట్ మురళీమోహన్ వ్యవహరించారు.

# కాలం కరిగిపోతుంది... ఆశ ఆవిరవుతోంది!



***నిన్నగాక మొన్న ఎలక్షన్ జరిగినట్లు... చంద్రబాబు ముఖ్యమంత్రి అయినట్లుగా వుంది. తిరిగి చూస్తే మూడేళ్లు గిర్రున తిరిగిపోయాయి. ఏది ఆగినా కూడా కాలం ఆగదు కదా! తెలుగుదేశం అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటినా కూడా చాలామంది నాయకుల ఆశలు తీరలేదు. ఇప్పటికీ ఆశల పల్లకిలో వూరేగుతూనే వున్నారు. మహా అంటే ఇంకో ఆరేడు నెలల దాకా నామినేటెడ్ పదవులిస్తారు. ఆ తర్వాత ఎలక్షన్ ట్రెండ్ మొదలవుతుంది. నామినేటెడ్ పదవుల గురించి ఆలోచన చేసే టైం కూడా వుండదు.***

నామినేటెడ్ పదవుల విషయంలో జిల్లాలోని తెలుగుదేశం నాయకులు ఇంకా అసంతృప్తితోనే రగిలిపోతున్నారు. పార్టీ కోసం పనిచేసిన వాళ్లకు పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదనే బాధ కొందరిలో వుంది. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక జిల్లా పరంగా చూస్తే కిలారి వెంకటస్వామినాయుడుకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ పదవిని, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి నుడా ఛైర్మెన్ పదవిని ఇచ్చారు. ఈ రెండూ జిల్లా పదవులే! వాళ్లకు కాకున్నా ఎవరోఒకరికి ఇవ్వాలి. పార్టీని కనిపెట్టుకుని వున్నారు కాబట్టి వారికివ్వడంలో తప్పులేదు. అలాగే ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ పదవిని మంత్రి నారాయణ కోటాలో కాంగ్రెస్‌లో నుండి వచ్చిన చాట్ల నరసింహారావుకు ఇచ్చారు. ఇటీవల ఆఫ్కాప్ ఛైర్మెన్‌గా కొండూరు పాల్‌శెట్టిని నియమించడం జరిగింది.

కాని పార్టీని నమ్ముకుని, పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు పార్టీ కోసం పని చేసిన ఇంకొందరు నాయకులకు ఇంతవరకు ఎటువంటి పదవులు లభించలేదు. మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి, మాజీమున్సిపల్ ఛైర్‌పర్సన్ అనూరాధ దంపతులను పదవుల విషయంలో పూర్తిగా పక్కన పెట్టినట్లుగా కనిపిస్తోంది. 1983 నుండి పార్టీని కనిపెట్టుకున్నోళ్లు వీళ్లు. 'నుడా' ఛైర్మెన్ పదవి ఇస్తారని ఆశించారు. అది రాలేదు. అనూరాధను మహిళా కమిషన్ సభ్యురాలిగానో, టిటిడి బోర్డు సభ్యురాలిగానో నియమిస్తారనే ప్రచారం వుంది. అయినా ఇంతవరకు ఆచరణ రూపం దాల్చలేదు.

2014లో నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి తెలుగుదేశం తరపున మేయర్ అభ్యర్థిగా ఎవరూ ముందుకు రాని పరిస్థితుల్లో అన్నీ తానై ముందుకొచ్చిన వ్యక్తి డాక్టర్ జడ్.శివప్రసాద్. ఆ ఎన్నికల్లో పార్టీ కోసమే రంగంలోకి దిగాడు. నెల్లూరుజిల్లాలో వై.యస్. గాలి బాగా తోలడంతో గట్టిగా ఢీకొట్టి కూడా దెబ్బతిన్నాడు. పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లు పార్టీ ఉనికిని చాటేలా టీడీపీ డాక్టర్స్ సెల్ అధ్యక్షులుగా జిల్లా వ్యాప్తంగా ఎన్నో వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీలో ఏ పని అప్పగించినా సమర్ధవంతంగా పూర్తి చేస్తున్నాడు. పార్టీ కోసం అన్ని విధాలా నష్టపోయిన జడ్.యస్.కు పార్టీ నుండి ఇంకా న్యాయం జరగలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండుసార్లు తూర్పు రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం నుండి తెలుగుదేశం ఎమ్మెల్సీగా పోటీచేసి ఆర్థికంగా దెబ్బతిన్న వ్యక్తి, న్యాయవాది దేశాయిశెట్టి హనుమంతరావు. పార్టీ బలహీనంగా వున్న రోజుల్లో కూడా అతను పార్టీ కోసం నిలబడ్డాడు. పార్టీ పరంగా అతనికీ ఇంతవరకు ఎలాంటి ప్రాధాన్యత లభించలేదు. తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు కంటే సీనియర్ వేనాటి రామచంద్రారెడ్డి. ఆయన పెద్ద పెద్ద నామినేటెడ్ పదవులను ఆశించడం లేదు గాని టిటిడి బోర్డు సభ్యుడిగా అవకాశం దక్కితే చాలనుకుంటున్నాడు. మరి చంద్రబాబు ఆయనకు ఆ అవకాశమిస్తాడో లేదో చూడాలి. 2014 ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ నుండి పోటీ చేసి పరాజయం పాలైన డా॥ బి.జ్యోత్స్నలతకు కూడా నామినేటెడ్ పదవి ఆశ చూపించివున్నారు. వైసిపి నుండి గెలిచిన ఎమ్మెల్యే పాశం సునీల్ తెలుగుదేశంలో చేరడంతో ఆమెకు అప్పటివరకు వున్న గూడూరు ఇన్‌ఛార్జి హోదా కూడా పోయింది. ఇక నామినేటెడ్ పదవి రాకుంటే ఆమెకూ అన్యాయం చేసినట్లే!

కాలం వేగంగా కదులుతోంది. వీళ్లకు ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ నామినేటెడ్ పదవులు రావు. ఇంకో ఆరేడు నెలల తర్వాత ఇచ్చినా కూడా ఎలక్షన్ ట్రెండ్ మొదలైతే వాటివల్ల ఉపయోగం వుండదు.

# జగనన్న పథకాలతో 'దేశం' నేతలు బెంబేలు

**- అనిల్‌కుమార్ యాదవ్**



గుంటూరులో జరిగిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్లీనరీ వేదికపై జగనన్న ప్రకటించిన 9 పథకాలతో తెలుగుదేశం నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ నెల 11వ తేదీన ఆయన నెల్లూరు 4వ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ కాలనీ, మధురా నగర్, దీన్‌దయాళ్ నగర్‌లలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ వైసిపి ప్లీనరీ విజయవంతమైన తీరు చూస్తుంటే ప్రజల్లో తెలుగుదేశం ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత వుందో, వైసిపి పై ఎంత అభిమానముందో అర్థమవుతుందన్నారు. నంద్యాల ఉపఎన్నికలను చూసి తెలుగుదేశం నాయకులు భయపడుతున్నారని, జనరల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగన్మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మధురా నగర్‌లో రోడ్లు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, సిమెంట్‌రోడ్లు ఎలాగూ వేయడంలేదు కాబట్టి కనీసం గ్రావెల్ రోడ్లు అయినా వేయాలని ఆయన అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్ ఎం.ద్వారకానాథ్, కార్పొరేటర్ ఓబిలి రవిచంద్ర, వైసిపి నాయకులు పోలంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సంక్రాంతి కళ్యాణ్, బి.హరిప్రసాద్‌నాయుడు, శేషయ్య, కొండారెడ్డి, నాగేంద్ర, దశరథరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధురానగర్‌కు చెందిన కొందరు యువకులు, మహిళలు అనిల్ సమక్షంలో వైసిపిలో చేరారు.

# అంతర్గత ఫైల్స్ అన్నీ ఈ ఆఫీసు ద్వారానే!




ప్రతి శాఖలోని అంతర్గత ఫైల్స్ అన్ని ఈ-ఆఫీస్ విధానంలో చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ఆయన ఛాంబర్లో ఈ-ఆఫీస్ పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా శాఖాధిపతి నుండి మాత్రమే ఈ ఆఫీస్ విధానం అమలు చేస్తున్నారని, అది సరికాదన్నారు. ప్రతిశాఖ అంతర్గత ఫైల్స్ అన్ని కూడా ఈ పాస్ విధానం డిజిటల్ సిగ్నేచర్ ద్వారా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిశాఖ అంతర్గత ఫైల్స్‌ను ఈ పాస్ విధానంలో 10రోజుల్లో అమలు చేయాలని తరువాత ప్రతి శాఖకు ఒక డిప్యూటి కలెక్టర్ స్థాయి అధికారిని పంపించి సదరు శాఖ అంతర్గత ఫైల్స్ అన్నీ ఈ-ఆఫీస్ విధానం ద్వారానే నడుస్తున్నాయా లేదా అని రాండమ్‌గా తనిఖీ చేయబడతాయన్నారు. ఎవరైనా ఈ విషయంపై అలసత్వం కనపరిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. బయోమెట్రిక్ విధానం ద్వారా ప్రతి కార్యాలయంలో సిబ్బంది హాజరును నమోదు చేయాలన్నారు. దీనివల్ల ఖచ్చితంగా ఉద్యోగులు తమ కార్యాలయాలకు విధులకు హాజరవుతారన్నారు. అదే విధంగా ఆసుపత్రులు, పాఠశాలలు, వసతి గృహాలలో బయోమెట్రిక్ విధానం అమలు పరచాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేసారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.ఎండి ఇంతియాజ్, డిఆర్ఓ వెంకటసుబ్బయ్య, ఎన్ఐసి అధికారి సాయి పాల్గొన్నారు.

# డ్వాక్రా మహిళలకు చేయూత



రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళల అభివృద్ధికి కట్టుబడి పని చేస్తోందని నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. 9వ తేదీ నెల్లూరులోని మహేశ్వరి పరమేశ్వరి ఫంక్షన్ హాల్లో ఆయన డ్వాక్రా బజారును లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డ్వాక్రా మహిళలకు 5లక్షల నుండి 10లక్షల దాకా బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. మహిళలు తమ కాళ్ళ మీద తాము నిలబడే విధంగా బ్యాంకు రుణాలతో తమ ఇంటివద్దనే పచ్చళ్ళు, పిండి వంటలు, బట్టల వ్యాపారం వంటి వినూత్నమైన ఉపాధితో ముందుకు పోతున్నారన్నారు. డ్వాక్రా మహిళల ఉత్పత్తులను ప్రతిఒక్కరూ కొని వారిని ఆదరించాలన్నారు. నెల్లూరు నగరంలో డ్వాక్రా మహిళల ఉత్పత్తులను ప్రతిఒక్కరూ కొని, వారిని ఆదరించాలని చెప్పారు. నెల్లూరు నగరంలో డ్వాక్రా మహిళల ఉత్పత్తుల మార్కెట్‌కు మంచి గిరాకి వుందని ఆయనన్నారు. డ్వాక్రా స్వయం సహాయక గ్రూపుకు సంబంధించిన అభ్యుదయ, గ్రామీణ, డ్వాక్రా స్టేట్ కమిటి అధ్యక్షురాలు శ్రీమతి కె.దేవకిదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సహకారంతో డ్వాక్రా మహిళల ద్వారా అనేక ఉత్పత్తులు చేయించి జిల్లాల్లో ఎగ్జిబిషన్ మరియు సేల్ మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

# 'దేశం'పై యాదవ దండయాత్ర



**ఒట్టూరు సంపత్‌రాజు**

2014 ఎన్నికల్లో అధికారం కోసం చంద్రబాబు కులాలను బాగా వాడుకున్నాడు. ఒక్కో కులానికి ఒక్కో రకం ఆశ చూపాడు. కొందరికి రిజర్వేషన్‌లు, కొందరికి ప్రత్యేక కార్పొరేషన్లు... ఇలా ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారాన్ని చేపట్టాడు. అధికారంలోకి వచ్చాక కొన్ని కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటుచేసి నిధులు కేటాయించాడు.

మరి నిన్నగాక మొన్నొచ్చి ఓట్లేసిన కులాల వారికే కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి నిధులిస్తుంటే, మరి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి ఆ పార్టీకి గట్టి మద్దతుదారులుగా వున్న మాకు ప్రత్యేక కార్పొరేషన్ ఎందుకు ఏర్పాటు చేయరంటూ యాదవులు ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశంకు బలహీనవర్గాల ప్రజలు బలమైన పునాదైతే, అందులో యాదవులది కీలకపాత్ర. అయితే చంద్రబాబు అన్ని కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినట్లు యాదవ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి 2వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ఒట్టూరు సంపత్‌రాజు ఈ నెల 15వ తేదీన నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద ఒక్కరోజు దీక్షకు పూనుకున్నాడు.

రాష్ట్రంలో 16శాతం మంది యాదవులున్నారు. 6శాతం వున్న కాపులకు కార్పొరేషన్ పెట్టి వెయ్యి కోట్లు నిధిని ఏర్పాటు చేశారు. మరి 16శాతం వున్న యాదవులకు 2వేల కోట్లు కేటాయించాలని కోరడం న్యాయమే. తెలంగాణలో ప్రతి యాదవ కుటుంబానికి 2బర్రెలు, 20గొర్రెలు ఉచితంగా ఇస్తున్నారు. మన రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వం ద్వారా యాదవులకు ఎటువంటి న్యాయం జరగడం లేదు. యాదవులకు సంపూర్ణ న్యాయం చేయాలని, యాదవ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ చేసే యాదవ కార్పొరేషన్ సాధనా దీక్షకు జిల్లాలోని యాదవులందరూ హాజరు కావాలని సంపత్‌రాజు కోరుతున్నాడు.

# కిషోర్స్ రత్నం విద్యార్థుల విజ్ఞాన పర్యటన



నెల్లూరు డైకస్‌రోడ్డులోని డా॥ కిషోర్స్ రత్నం మోడల్ స్కూల్ విద్యార్థులు 10వతేదీ ఉపాధ్యాయులతో కలసి మానసికోల్లాసానికి విజ్ఞాన పర్యటన చేశారు. నెల్లూరు నగరంలోని పలు ఉద్యానవనాలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న ప్రదేశాలకు తీసుకెళ్లి వారికి "సైన్స్ ఆర్గాన్స్" తదితర అంశాలను గురించి వివరించారు. విద్యార్థులు ఆసక్తిగా ఆలకిస్తూ అడిగిన ప్రశ్నలకు సులభంగా జవాబులు చెప్పి ఆనందాన్ని వ్యక్తం చేశారు. పాఠశాల డైరెక్టర్స్ డా॥ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ మాట్లాడుతూ ఇలాంటి ప్రోత్సాహ భరితమైన కార్యక్రమాలను రూపొందించడం ద్వారా ప్రకృతిలోని విషయాలను పరిశీలనాత్మక దృష్టితో చూడడం ఎలాగో విద్యార్థులకు తెలియజేస్తున్నారన్నారు. పాఠశాల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రిన్సిపల్స్ విజయ, రామచంద్రయ్య, మేనేజర్ విజయచంద్ర, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 15 నుంచి జిల్లా బ్యాడ్మింటన్ పోటీలు



నెల్లూరుజిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16న జిల్లా స్థాయి పోటీలను నిర్వహించి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు. నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో సోమవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అండర్-13, 15, 17, 19 బాలబాలికలు, మెన్స్, ఉమెన్స్ కేటగిరీల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలను నిర్వహించనున్నామన్నారు. వయస్సు ధృవీకరణ పత్రాలు, డ్రస్‌కోడ్‌తో హాజరు కావాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 20 నుంచి నంద్యాలలో జరిగే అండర్-19 పోటీలు, ఆగస్టు 21 నుంచి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఏపి స్టేట్ సీనియర్ బ్యాడ్మింటన్(మెన్స్, ఉమెన్స్) ఛాంపియన్, సెప్టెంబర్ 27 నుంచి అనంతపురంలో ఏపి స్టేట్ జూనియర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని వివరించారు. ఇతర వివరాలకు 9494492717 నెంబరులో సంప్రదించాలని కోరారు.

**మరో అవకాశం:** నెల్లూరు ఏసి స్టేడియంలో ఈ నెల 11న నిర్వహించిన రాష్ట్ర స్థాయి అకాడమీ ప్రవేశ ఎంపికల్లో పాల్గొనలేకపోయిన క్రీడాకారులకు ఈ నెల 15, 16వ తేదీల్లో మరో అవకాశాన్ని కల్పిస్తున్నట్లు డిఎస్డీఓ రమణయ్య తెలిపారు.

### రెడ్‌క్రాస్ క్యాన్సర్ వైద్యశాలకు

# లక్ష రూపాయల విరాళం

నెల్లూరు పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి సోమవారం స్వర్గీయ మేడికొండ వెంకయ్యనాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మేడికొండ పద్మమోహన్ నాయుడు తన ప్రతినిధులైన టి.భాస్కరరావు, బి.సత్యనారాయణసింగ్‌ల ద్వారా క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా॥ టి.లక్ష్మికి లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టి.భాస్కరరావు మాట్లాడుతూ ఈ విరాళాన్ని ఆసుపత్రి అభివృద్ధికి, పేద క్యాన్సర్ రోగులకు వినియోగించవలసినదిగా కోరారు. భవిష్యత్తులో కూడా తమవంతు సహకారాన్ని అందజేస్తామన్నారు.

# ఏబివిపి ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు రామలింగాపురంలోని శివాజీభవన్‌లో ఏబివిపి 68వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈ నెల 9వ తేదీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబివిపి ప్రముఖ్ గంగాధర్ చేతుల మీదుగా జెండాను ఎగురవేశారు. అనంతరం ఏబివిపి నగర కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబివిపి ఎనలేని కృషి చేస్తోందన్నారు. బాబు, అనిల్‌సాయి, సుబ్రహ్మణ్యం, నాగిరెడ్డి, కిషోర్, శంకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### 18సంవత్సరాలు నిండిన

# యువత ఓటు నమోదు చేసుకోవాలి

- ఆర్డీవో అరుణ్‌బాబు



18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ప్రతిఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో అరుణ్‌బాబు సూచించారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని ఈ నెల 8వ తేదీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ లోగా ఓటర్లు నమోదు చేసుకోవచ్చని, ఓటర్లు మార్పులు చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు. ఆదివారం గూడూరు పట్టణంలోని బూత్ వద్ద ఓటర్లు నమోదు జరుగుతుందని తెలిపారు. పట్టణంలోని 5కళాశాలల్లో ఓటర్లు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడం ముఖ్యమని తెలియజేశారు.



## గూడూరు డివిజన్ వార్తలు

# చదువుతోనే.. పేదరికంపై గెలుపు!



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, పక్కన రాజేంద్రప్రసాద్, ఇస్మాయిల్, మనపాటి రవీంద్రబాబు

సమాజంలో పేదరికాన్ని జయించడానికి ఏకైక మార్గం చదువు మాత్రమేనని గూడూరు పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన అన్నారు. గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కళాశాలలో 9వ తేదీ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పిఎస్‌ఆర్ ట్రస్టు సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదోతరగతిలో 10పాయింట్లు వచ్చిన విద్యార్థులకు బంగారు ఉంగరాలు, మరో 20మంది విద్యార్థులకు వాచీలు, ఫైల్సు, జ్ఞాపికలను బహుమతులుగా అందించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పేదరికాన్ని జయించాలంటే చదువే ఆయుధంగా మార్చుకుని ముందుకు సాగితే భవిష్యత్తు బంగారంగా ఉంటుందని తెలిపారు. సర్కారు పాఠశాలల్లో చదివేవారికి తెలివితేటలు ఎక్కువగా ఉంటాయని, ప్రతిఒక్కరూ దాతలు ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఇవో ఇస్మాయిల్, కళాశాల ప్రిన్సిపాల్ రేవతి, డాక్టర్ నారాయణ, మనపాటి రవీంద్రబాబు, ప్రతినిధులు నాగరాజు, చెంచునారాయణ, రాజశేఖర్, ఇబ్రహీం, చంద్ర తదితరులు ఉన్నారు.

# విద్యార్థులకు నెల్‌క్యాస్ట్ బ్యాగులు



గూడూరు నెల్‌క్యాస్ట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో 11వ తేదీ చవటపాళెం, దీవిపాళెం, అడవి కాలని, అనాధ హాస్టల్స్ విద్యార్థులకు సుమారు 1000 బ్యాగులు, నోటుబుక్స్, ప్లేట్లు, జామిట్రి బాక్సులు, గ్లాసులు దీవిపాళెం సర్పంచ్ పిట్టి చంద్రసేన, ఆడిటర్స్ జానకిరామం, మయాంక్ మునిషి, నెల్‌క్యాస్ట్ సీనియర్ జనరల్ మేనేజర్ ఆపరేషన్స్ యన్.యస్.రెడ్డి, జనరల్ మేనేజర్ ఫైనాన్స్ దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకొని మంచి వృద్ధిలోకి రావాలన్నారు. విద్యార్థులకు నెల్‌క్యాస్ట్ మేనేజ్‌మెంట్ అవసరమైన సహాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్‌క్యాస్ట్ మేనేజర్ పబ్లిక్ రిలేషన్స్ ఆనిమెళ్ళ శివకుమార్, జనరల్ మేనేజర్ కె.సి.బ్రహ్మానందరెడ్డి, డీజీఎమ్ టి.మురళీకృష్ణ, సెక్యూరిటీ మేనేజర్ పి.రామ్మోహన్‌రావు, డిప్యూటి మేనేజర్ ఎన్.శ్రీనివాసమూర్తి, కుమార్, స్కూలు హెడ్‌మాస్టర్ ఎమ్.పురంధర్‌రాజు, ఉపాధ్యాయులు నాగమణి, రేవతి, బలరామయ్య, ప్రసన్న, కవిత, మంగారావు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోటరీ నూతన కమిటి



మాట్లాడుతున్న మాజీ రోటరీ గవర్నర్ మోహన్‌ప్రసాద్

గూడూరు ప్రాంతంలో రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను చేయడంలో ప్రత్యేక గుర్తింపు పొందిందని మాజీ రోటరీ గవర్నర్ మోహన్‌ప్రసాద్ అన్నారు. గూడూరు, రోటరీ భవనంలో ఈనెల 8వతేదీ నూతన అధ్యక్షునిగా మునిరాజా, కార్యదర్శిగా బాలకృష్ణంరాజు, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలుగా ప్రభ, కార్యదర్శిగా విష్ణువందన ప్రమాణస్వీకారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్స్ కె.మునిగిరీష్, నాగసూరి గోపాలరావు, బొమ్మారెడ్డి సురేంద్రరెడ్డి, ఇన్నర్‌వీల్ మాజీ అధ్యక్షురాలు వై. స్నేహలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### షిరిడి సాయిబాబా మందిరంలో

# పేదలకు దుస్తులు



పేదలకు సేవ చేయడం అభినందనీయమని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి అన్నారు. ఈనెల 8వతేదీ గూడూరు పట్టణం, షిరిడి సాయినగర్‌లోని సాయిబాబా మందిరంలో పోచారెడ్డి జనార్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు పోచారెడ్డి ఆదిశేషారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి దాతృత్వంలో పలు ప్రాంతాలకు చెందిన 600మంది పేదలకు డాక్టర్ సి.రోహిణి చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, శ్రీకంఠి నాగరాజు, రామమోహన్‌రావు, కోట ప్రమీలమ్మ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



గూడూరు ఇన్నర్‌వీల్ క్లబ్ నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన పెనుబోలు ప్రభారెడ్డికి ఇటీవల పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలుపుతున్న ఆంధ్ర మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, మాజీ ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు వై.స్నేహలతారెడ్డి, విష్ణువందన, ఎల్లసిరి లక్ష్మి తదితరులు.

గల్పిక

# లోకేష్ షాక్‌కు.. నేతల మైండ్ బ్లాక్

సదావర్తి భూములను ఎవరంటే వాళ్ళ చేత కొనిపిస్తే ఒప్పుకోను, బినామీలను అసలు ఒప్పుకోను, ఆళ్ల రామకృష్ణారెడ్డే కొనాలి, బినామీలను పెట్టుకుంటే రామకృష్ణారెడ్డి ఇంటి మీదకు ఐ.టి వాళ్లను పంపుతా... సిబిఐని ఉసికొల్పుతా! ఆయనపై కేసు వేసి కోర్టుకీడుస్తా... ఏబిసిడి న్యూస్ ఛానల్‌లో వస్తున్న తన పుత్రరత్నం నారా లోకేష్ ప్రెస్‌మీట్‌ను ఉండవల్లిలోని తన ఇంట్లో కూర్చుని ఎంతో ఆనందంగా చూస్తున్నాడు హైటెక్‌రత్న, నవ్యాంధ్ర సీఎం చంద్రబాబునాయుడు. అక్కడే వున్న మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నక్కా ఆనంద్‌బాబు, దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావులు పులి కడుపున పులే పుడుతుందనడానికి మన యువరాజే సాక్ష్యం సార్. పగబట్టిన వాళ్ల దుంపతెంచడంలో మీకేమాత్రం తీసిపోడు అని చెప్పారు. అప్పుడే అక్కడకు ఎక్సైజ్ మంత్రి జవహర్‌బాబు వచ్చాడు. పెద్ద అట్టపెట్టె తెచ్చాడు. ఏంటది అని చంద్రబాబు అడిగాడు. హెల్త్‌డ్రింక్స్ సార్ అని జవహర్ చెప్పాడు. హెల్త్ డ్రింక్స్ అంటే ఏదన్నా ఆపిల్ జ్యూసో, మ్యాంగో జ్యూసో అయ్యుంటుందని అందరూ అనుకున్నారు. జవహర్ ఆ అట్టపెట్టె తెరిచి తలా ఒక బీరుసీసాను చేతిలో పెట్టాడు. అది చూసి చంద్రబాబు కోపంతో... జవహర్ ఏంటిది, మద్యం నేను తాగనని తెలుసు కదా! మద్యమే కాదు సిగరెట్, పాన్, ఖైనీ, జర్దా మసాలా, గుట్కా, మట్కా, పేకాట, సింగిల్ నెంబర్లాట... వగైరా వగైరా వ్యసనాలు నాకు లేవని తెలుసు కదా! ఈ మద్యం సీసాలెందుకు తెచ్చావని అడిగాడు. అందుకు జవహర్... అయ్యో సార్! మీ తెలివి తెల్లారినట్లే వుంది. ఇంతకాలం వీటిని మద్యం అనుకుని పొరపాటు పడి వీటిని ముట్టుకోలేదు. ఇవి మద్యం సీసాలు కాదు సార్, హెల్త్‌డ్రింక్ సీసాలు. వీటి సేల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మిమ్మల్నే పెడదామనుకుంటున్నా, అందుకే మీరు బీరు బాటిల్ ఎత్తితే ఆ ఫోటో తీసి ప్రచారానికి వాడుకుంటాం. అంతేకాదు, రాష్ట్రంలో ఈ హెల్త్‌డ్రింక్స్ సేల్స్ పెంచి రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు పలు ప్రణాళికలు రూపొందించామని చెప్పాడు. అవేంటో చెప్పు అని చంద్రబాబు విసురుగా అడిగాడు. జవహర్ అందుకు సమాధానమిస్తూ... రాష్ట్రంలోని ప్రతి ఆసుపత్రిలోనూ పేషంట్లకు సెలైన్‌లకు బదులు బీరు బాటిల్స్(హెల్త్‌డ్రింక్స్) వాడాలి. అలాగే ప్రతి నెల చౌకదుకాణాలలో రేషన్ తీసుకునే కార్డుదారులందరు కూడా విధిగా నెలకు ఐదు హెల్త్‌డ్రింక్స్ కొనుక్కోవాలి. రాష్ట్రంలో వున్న అన్ని కూల్‌డ్రింక్, మందుల షాపులలో ఈ హెల్త్‌డ్రింక్స్ అమ్మాలి. ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో విద్యార్థులకు నీరుకు బదులుగా బీరు ఇవ్వాలని నిబంధన పెట్టాం. పురిటిబిడ్డలకు తల్లిపాల కంటే బాబుగారి బీరు శ్రేష్టం అని డాక్టర్ల చేతే చెప్పిస్తాం. ప్రతినెలా రాష్ట్రంలో ఎవరైతే ఎక్కువ బీర్లు కొనుగోలు చేసివుంటారో అలాంటి వారిని గుర్తించి 'బీరుబాహుబలి' బిరుదుతో సత్కరిస్తాం అని చెప్పాడు. అంతా విన్న చంద్రబాబు... నీ హెల్త్‌డ్రింక్స్ సేల్స్ ఐడియా బాగానే వుందిగాని దాని ప్రచారానికి చాలామందే వున్నారు. ప్రచారానికి వాళ్లను వాడుకో అని చెప్పాడు. సార్, హెల్త్‌డ్రింక్స్ దేవాన్ష్ బాబుకు కూడా రెండిచ్చిపోతా అని జవహర్ అన్నాడు. నీకు దండం పెడతా నాయనా, వాటిని జనాలకు తాపించమని చెప్పాను, మాకు తాగించ మని కాదు, ముందు వెళ్లి ఆ పని చూడు అని చంద్రబాబు అతనిని పంపేసాడు. అంతలో యనమల రామకృష్ణుడు ఆయాసపడుతూ అక్కడకు వచ్చాడు. ఆయన మొహంలో టెన్షన్ కనిపిస్తుంది. ఏమైంది యనమల అని చంద్రబాబు అడిగాడు. నేను వైసిపి ప్లీనరీ నుండి వస్తున్నాను సార్, ప్లీనరీ బాగా సక్సెస్ అయ్యింది. ఇక అసలు విషయం ఏంటంటే అక్టోబర్ 27 నుండి జగన్ ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం దాకా పాదయాత్ర చేస్తానని ప్రకటించాడు. 2004 ఎన్నికలకు ముందు వై.యస్. ఇలాగే పాదయాత్ర చేసి గెలిచేసాడు. ఇప్పుడు కూడా సీన్ రిపీట్ అవుతుందేమోనని నా టెన్షన్ అని యనమల చెప్పాడు. చంద్రబాబు ఆవేశంతో... నిద్రలేస్తే మనల్ని విమర్శిస్తుంటాడు. మనం వేసిన రోడ్ల మీద పాదయాత్ర ఎలా చేస్తాడు. పాదయాత్ర చేయకుండా పోలీసులను పెడదాం అని అన్నాడు. అందుకు పత్తిపాటి పుల్లారావు... అలా చేస్తే జగన్‌కు భయపడి మనమే పాదయాత్రను అడ్డుకున్నామని ప్రజల్లో చెడ్డ పేరొస్తుంది. దానికి బదులు భూగర్భ డ్రైనేజ్ అనో, మంచినీటి పైప్‌లైన్ల పనులనో నెల్లూరులో మాదిరిగా రాష్ట్రంలో అన్ని రోడ్లను పగలగొడదాం, ఆ రోడ్ల మీద నడవలేక జగనే పాదయాత్రను మానుకుంటాడని సలహా ఇచ్చాడు. అంతలో అమరావతిలో ప్రెస్ మీట్ ముగించుకుని లోకేష్ వచ్చాడు. అంతా టెన్షన్‌గా ఉన్నట్లున్నారు, ఏంటి విషయం అని లోకేష్ అడిగాడు. జగన్ పాదయాత్ర గురించి యనమల చెప్పాడు. అది విన్న లోకేష్ చాలా తేలికగా... ఓస్ అంతేనా... అతను 3వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తే నేను 30వేల కిలోమీటర్లు పాదయాత్ర చేస్తా... చాలా అని అడిగాడు. అది వినగానే సోమిరెడ్డి... బాబూ, మీరు మన రాష్ట్రంలో పాదయాత్ర చేస్తే చాలు... మరీ 30వేలంటే పక్క రాష్ట్రాలే కాకుండా చైనా, మయన్మార్, నేపాల్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్‌లకు కూడా పోతారని అన్నాడు. ఎక్కడకు పోయినా పాదయాత్ర పక్కా, రేపే ముహూర్తం అని చెప్పి లోకేష్ లోపలకు వెళ్లాడు. లోకేష్ మాటలతో చంద్ర బాబుకు వెయ్యి ఏనుగుల శక్తి వచ్చింది. వెంటనే ఆయన సెల్ తీసి రాష్ట్రపతి అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు వెంకయ్యనాయుడు, సిద్ధార్థసింగ్, రామ్‌నాథ్‌సింగ్, అరుణ్ జైట్లీ, అమిత్‌షాలకు ఫోన్ చేసి తన కొడుకు పాదయాత్ర ప్రారంభోత్స వానికి రావాలని కోరాడు.

* * * * *

నవ్యాంధ్ర రాజధాని అమరావతి. జాతీయ, రాష్ట్ర నేతలంతా వచ్చి వున్నారు. అందరినోట 30వేల కిలోమీటర్ల పాదయాత్ర సాధ్యమేనా... అయినా ఇప్పుడు మొదలుపెడితే 2024 ఎలక్షన్ కన్నా పూర్తి చేయగలడా? అందరి నోటా అవే సందేహాలు. రామ్‌నాథ్‌కోవింద్, మోడీ, వెంకయ్య, అమిత్‌షా, చంద్రబాబులు వేదిక మీద కూర్చుని వున్నారు. అప్పుడే లోకేష్ కారు దిగాడు. కార్యకర్తలు జయజయధ్వానాలు చేస్తుండగా తెలుగు మహిళలు మంగళహారతులిచ్చారు. లోకేష్ పాదయాత్రలో పంపిణీచడానికి పాతిక లారీల నిండా ఆహార పదార్థాలు, వాటర్ బాటిళ్లు పెట్టి సిద్ధం చేసారు. నాన్నగారు ఇలారండి అని లోకేష్ చంద్రబాబును పిలిచాడు. పాదాభివందనం చేయడానికేమన్నా పిలుస్తున్నాడేమోనని చంద్రబాబు స్టేజీ నుండి క్రిందకు దిగి నిలబడ్డాడు. లోకేష్ వెంటనే రెండు చేతులతో నమస్కారం చేస్తూ చంద్రబాబు చుట్టూ మూడురౌండ్లు కొట్టాడు. నా దీవెనలు నీకెప్పుడూ ఉంటాయి. పెద్దలందరి ఆశీస్సులు తీసుకుని ఇక పాదయాత్రకు బయలుదేరు నాయనా అని చంద్రబాబు అన్నాడు. ఎక్కడికి పోయ్యేది నాన్నగారు, నా పాదయాత్ర పూర్తయ్యిందని లోకేష్ అన్నాడు. ఆ మాటకు చంద్రబాబుతో పాటు అక్కడున్న అందరూ అవాక్కయ్యారు. చంద్రబాబు కొంచెం సాధారణ స్థితిలోకి వచ్చి... పాదయాత్ర పూర్తికావడమేంటని అడిగాడు. మీ చుట్టూ మూడుసార్లు పాదాలతో నడిస్తే 30వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసినట్లే నాన్నగారు... మీరే నాకు తెలిసిన ప్రపంచం. ప్రపంచాన్నే మూడుసార్లు చుట్టి రావడమంటే ఇదే కదా... పురాణాలలో సుబ్రహ్మణ్య స్వామికి, వినాయకుడికి మధ్య లోకసంచారం పోటీపెడితే శివుడి చుట్టూ రౌండ్లు కొట్టి వినాయకుడు చేసింది కూడా ఇదే కదా అని లోకేష్ అన్నాడు. ఆ మాటకు చంద్రబాబుతో పాటు అందరి మైండ్‌లు బ్లాకయ్యాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 14.7.2017 నుండి
తేది. 20.7.2017 వరకు

ఈ వారము మీన మేష వృషభ రాశులలో చంద్రుడు, వృషభంలో శుక్రుడు, మిధునంలో రవి, 17వ తేది నుండి కర్కాటకంలో రవి, కర్కాటకంలో బుధకుజులు, సింహంలో రాహువు, కన్యలో గురువు, వృశ్చికంలో శని, కుంభంలో కేతువు సంచరిస్తారు.

### పంచాంగము

తేది 17 సోమవారం సూర్యుడు కర్కాటక రాశి ప్రవేశము.
దక్షిణాయన పుణ్యకాలము.
ముహూర్తములు లేవు.

### ఆషాఢ మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 14 | శుక్ర | పంచమి | ప॥ గం.11.54ని॥ |
| తేది. 15 | శని | షష్ఠి | ఉ॥ గం.11.00ని॥ |
| తేది. 16 | ఆది | సప్తమి | ఉ॥ గం.9.48ని॥ |
| తేది. 17 | సోమ | అష్టమి | ఉ॥ గం.8.08ని॥ |
| తేది. 18 | మంగళ | నవమి | ఉ॥ గం. 6.12ని॥ |
| | పిదప | దశమి | రా॥ గం. 4.00ని॥ |
| తేది. 19 | బుధ | ఏకాదశి | రా॥ గం.1.37ని॥ |
| తేది. 20 | గురు | ద్వాదశి | రా॥ గం.11.08ని॥ |

### మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఆదాయ వృద్ధి ప్రయత్నాలు జరుపుతారు. బిడ్డల చదువులు, పెండ్లిండ్ల సమస్యగానే ఉంటాయి. గృహ వస్తు, వాహన రిపేర్లుంటాయి. ఉద్యోగులకు స్థాన మార్పులు, అధిక బాధ్యతలుంటాయి. చిరు వ్యాపారులు కాంట్రాక్టర్లకు బాగుంటుంది. కుటుంబ పరంగా చిన్న చిన్న సమస్యలుండి సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలు బాగుండి ఆదాయం ఫరవాలేదనిపిస్తుంది.

### వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర 1, 2పాదాలు

కాంట్రాక్టు పనులు, గృహ నిర్మాణాలు మందకొడిగా సాగుతాయి. అనుకున్న పనులను సమర్థవంతంగా జరుపుతారు. మీ సూచనలు సలహాల వల్ల ఇతరులకు మంచి జరుగుతుంది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఉద్యోగులకు బాధ్యతలు, అధికారులకు స్థాన మార్పులుంటాయి. ఉన్నత విద్యావకాశాలు దొరకగలవు. ఆర్థిక వ్యవహారాలను జాగ్రత్తగా జరపండి.

### మిధునం



మృగశిర 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

భూ లావాదేవీలు వాయిదా వేసికొనండి. ఆరోగ్యం బాగుంటుంది. అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. ఉద్యోగులకు అధికారుల నుండి అనుకూలత, బంధువర్గంతో కొద్దిపాటి విభేదాలుంటాయి. ఉన్నత విద్యావకాశాలుంటాయి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. కొత్త ఆభరణాలు, స్థిరాస్తులు సమకూరుతాయి.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

నిర్మాణాలు జరిపే వారికి, కాంట్రాక్టర్లకు స్వల్ప ఇబ్బందులుంటాయి. ఉద్యోగులకు పని భారం, అధికారుల వత్తిడి ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. శుభ కార్యాలు నిర్ణయం కాగలవు. బిడ్డల విద్యా వ్యవహారాలు సంతోషం కలిగిస్తాయి. కొత్త వస్తువులు సమకూరుతాయి. ఆదాయంకు తగినట్లు ఖర్చులుంటాయి. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

అనవసర వ్యవహారాలలో ప్రవేశించవద్దు. ఉద్యోగులకు పనిభారం పెరిగినను అధికారుల సహకారం బాగుంటుంది. బిడ్డలకు విద్యా ఉపాధి అవకాశాలు బాగుంటాయి. వివాహ ప్రయత్నాలు వాయిదా పడవచ్చు. విలువైన వస్తువులు, పత్రాలు భద్రపరచుకొనండి. ఆరోగ్యం బాగుంటుంది. మంచి ఆర్థికావకాశాలుండి అవకాశాలను సద్వినియోగం చేసుకొంటారు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వ్యాపారులకు, ఉద్యోగులకు ప్రభుత్వ పరంగా ఇబ్బందులుంటాయి. శుభకార్యాలు నిర్ణయం కావడం, దూర ప్రయాణాలుండగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఉద్యోగులకు పని సామర్థ్యం, స్థాన మార్పులుండవచ్చును. స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదా పడతాయి. వ్యాపారాలు ఆశించిన రీతిలో సాగవు. అయినా డబ్బుకు ఇబ్బందులు ఉండవు.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్తపడండి. వాహనాలు నడిపేవారు, యంత్రాలు, కరెంటు పనులు చేసేవారు జాగ్రత్తపడాలి. ఉద్యోగావకాశాలు బాగుంటాయి. ఆర్థికంగా కొద్ది ఒడిదుడుకులుంటాయి. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. కోర్టు వ్యవహారాలందు అనుకూలత ఉంటుంది. గృహ వస్తువాహన రిపేర్లుంటాయి.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అధికారులకు స్థానమార్పులుండవచ్చును. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్త వహించండి. భాగస్వామ్య చర్చలు ఫలించగలవు. విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. ఆరోగ్యం ఫరవాలేదు. రావలసిన బాకీలు కొంత అందుతాయి. కుటుంబసౌఖ్యం కలదు. అనుకున్న పనులు ఆకస్మికంగా నెరవేరతాయి.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు స్థానమార్పులు, అధికారులకు ప్రమోషన్లు లభించగలవు. కుటుంబవ్యక్తులతో కొద్దిపాటి విభేదాలుండి సర్దుబాటు కాగలవు. శుభకార్యాలు నిర్ణయం కావడం, దూర ప్రయాణాలుంటాయి. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. అనుకున్న పనులు నెరవేరగలవు. కొత్త పెట్టుబడులకు, వ్యాపార విస్తరణకు అవకాశాలు దొరుకుతాయి.


### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వ్యతిరేకించిన వారే మీకు చేరువకాగలరు. స్థిరాస్తుల లావాదేవీలు, నూతన వస్తువులు కొనడం జరుగుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు కలిసివస్తాయి. ఆర్థికంగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాలు, దూరదేశ ప్రయాణాలు నిర్ణయం కాగలవు. బంధుశ్రేణి నుండి శుభవార్తలు వింటారు. విద్యావకాశాలు బాగుంటాయి.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపారాలలో అభివృద్ధి, దైవ సేవా సంస్థలకు సహాయపడడం, నిర్మాణాలు చేసేవారికి పురోగతి బాగుంటుంది. టెండర్లు, లీజులు లభించే దానికి మంచి సమయం. ఉద్యోగులకు స్థానమార్పులు, లేక అదనపు బాధ్యతలుంటాయి. కుటుంబ సౌఖ్యము, ఆరోగ్యము బాగుంటుంది. ఇంటా బయట వ్యవహారాలందు అవరోధాలను అధిగమించుతారు.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగ ప్రయత్నాలు, ఉన్నత విద్యావకాశాలు దొరుకుతాయి. ప్రముఖులతో పరిచయాలు, శుభకార్యాలు నిర్ణయం కావడం జరుగుతుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. అనుకున్న పనులు సకాలంలో పూర్తి చేస్తారు. మీ సలహాలు, మీ నిర్ణయాలు ఎదుటి వారికి అంగీకారమై, మంచి గుర్తింపు గౌరవాలు పొందుతారు. డబ్బు మదుపు చేసే అవకాశాలు దొరుకుతాయి.

# కల్యాణ వైభవం...!

## సోనిత - అనిల్ రెడ్డి    దినేష్‌రెడ్డి - సింధు



నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లోని వై.యస్.ఆర్ బేరింగ్స్ అధినేత వై.సుధాకర్‌రెడ్డి - శ్రీమతి పద్మలతల కుమార్తె **సోనిత - అనిల్‌రెడ్డి** (నెల్లూరు కాపువీధిలోని బి.ఎం షోరూం అధినేత బాబుల్‌రెడ్డి - సులోచనల కుమారుడు), సుధాకర్‌రెడ్డి కుమారుడు **దినేష్‌రెడ్డి - సింధు** (కొమ్మి వెంకటేశ్వర్లు - శ్రీమతి రాణిల కుమార్తెల కళ్యాణ వైభవ రిసెప్షన్ ఇటీవల నెల్లూరు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది.
నూతన వధూవరులకు 'లాయర్' అభినందనలు.

# జగనన్న వస్తే.. మంచి పథకాలు వస్తాయి



రాష్ట్రంలో చంద్రబాబు పాలనకు చరమదశ వచ్చిందని, జగనన్న ముఖ్యమంత్రిగా వస్తే రాష్ట్ర ప్రజల సంక్షేమానికి మంచి పథకాలు వస్తాయని వైయస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మంగళవారం వారు కావలిలోని వైఎస్సార్సీపి కార్యాలయంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశానుసారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఈనెల 9న గుంటూరులో జరిగిన వైఎస్సార్సీపి జాతీయ ప్లీనరీ విశేషాలను వివరించారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, జగన్ ముఖ్యమంత్రి అయితే అయిదెకరాల లోపు ఉన్న ప్రతిరైతుకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ప్రతి ఏడాది మే నెలలో 12,500 వంతున నాలుగేళ్ళకు 50వేల రూపాయలు మంజూరుచేసి చిన్నసన్నకారు రైతులను ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఇదే తొలి హామీగా ఇస్తారని, రెండవ హామీగా డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం అందజేస్తారని వారు తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో రైతులు, డ్వాక్రా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఆసరాగా ఈ పథకం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా, అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా 2 వేల రూపాయలు పింఛన్లు పంపిణీ చేస్తారని, అమ్మ ఒడి, ఇళ్ళు లేని వారికి పక్కా ఇల్లు, ఆరోగ్యశ్రీ పథకం పునరుద్ధరణ వంటివన్నీ జగనన్న పాలనలో ఉంటాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనుమర్లపూడి వెంకటనారాయణ, జిల్లా అధికారప్రతినిధి పందిటి కామరాజు, జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, కౌన్సిలర్లు దేగా రామయ్యయాదవ్, ఏడుంబాకుల వెంకయ్య, యల్లంటి ప్రభాకర్, పరుసు మాల్యాద్రి పాల్గొన్నారు.

# నెల్లూరు రైల్వే డిఎస్పీగా ఆంజనేయులు

నెల్లూరు రైల్వే డిఎస్పీగా ఆంజనేయులును నియమిస్తూ డిజిపి సాంబశివరావు 12వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా కొత్తచెరువు మండలానికి చెందిన ఆంజనేయులు 1995లో పోలీసుశాఖలో చేరారు. 2004లో డిఎస్పీగా పదోన్నతి పొందారు. రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో డిఎస్పీగా పని చేశారు. ఇంతకుముందు నెల్లూరు రైల్వే డిఎస్పీగా వున్న మోహన్‌రావు ఈ ఏడాది మార్చిలో అనారోగ్యంతో మరణించారు. అప్పటినుండి ఆ పోస్ట్‌లో ఎవరినీ నియమించలేదు. ఎట్టకేలకు ఆంజనేయులుతో భర్తీ చేశారు.

## కాలధర్మం

### సన్నపరెడ్డి విజయకుమార్‌రెడ్డి



బెంగుళూరు రియల్ ఎస్టేట్ రంగంలో మొఘల్‌గా వెలిగి, ఆ రంగానికి ఎంతో మందిని పరిచయం చేసిన నెల్లూరు జిల్లా కోవూరు వాసి, ఎస్‌విఆర్ ఇన్‌ఫ్రా అధినేత సన్నపరెడ్డి విజయ కుమార్‌రెడ్డి(63) ఈనెల 10వతేదీ హఠాన్మరణం చెందారు. ఈనెల 8, 9 తేదీలలో గుంటూరులో జరిగిన వైసిపి ప్లీనరీకి ఆయన హాజరయ్యారు. 9వ తేదీ రాత్రి గుంటూరు సమీపంలోని హైవే పక్కనే వున్న గెస్ట్‌హౌస్‌లో బస చేసారు. 10వ తేదీ ఉదయం వాకింగ్ నుండి వచ్చి తానుంటున్న గదిలోనే కుప్పకూలిపోయారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు వున్నారు. బెంగుళూరు నగరానికే రియల్ ఎస్టేట్ అంటే ఏంటో రుచిచూపించారాయన. 1991లోనే పినాకిని డెవలపర్స్ పేరుతో బెంగుళూరు నగరంలోనే వందలాది ఎకరాలలో లే అవుట్లు వేశారు. బెంగుళూరు రియల్ ఎస్టేట్ రంగంలో మొదటి అడుగు వేసిన నెల్లూరీయుడు విజయకుమార్‌రెడ్డే! అప్పట్లోనే ఆయన ఆఫీసు కర్నాటక మంత్రులు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులతో కిటకిటలాడుతుండేది. ఆయన సంస్థలో ఏజంట్లు, డెవలప్‌మెంటు ఆఫీసర్లుగా పనిచేసిన చాలామంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా అయ్యారు. కొందరు డెవలపర్లుగా, బిల్డర్లుగా అవతార మెత్తారు. ఇలా ఎంతోమంది భవిష్యత్‌కు ఆయన సంస్థ ద్వారానే బంగారు బాటలు పడ్డాయని చెప్పవచ్చు. బెంగుళూరులో ఎన్నో సేవా కార్యక్రమాలకు భూరి విరాళాలిచ్చారు. ఇటీవల పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానం మాజీఛైర్మెన్ సన్నపరెడ్డి వేణుగోపాలరెడ్డికి ఈయన తోడల్లుడవుతాడు. అందరితో కలుపుగోలుగా వుండే మనిషి. ఆయన అకాల మరణం పట్ల సంతాపం ప్రకటిస్తూ సన్నపరెడ్డి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### వంశీ యాడ్స్ శీనయ్య



వంశీ యాడ్స్ శీనయ్యగా నెల్లూరులో గుర్తింపు పొందిన వంశీ యాడ్స్ అధినేత పాములపాటి శ్రీనివాసులు(49) ఈనెల 9వతేదీ తెల్లవారుజామున అనారోగ్యంతో కన్ను మూశారు. ఆయన గత కొన్నేళ్లుగా కాలేయ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. పాతికేళ్లుగా వంశీ యాడ్స్ సంస్థ ద్వారా పత్రికా ప్రకటనల రంగంలో సేవలందించారు. అందరితోనూ ఎంతో స్నేహంగా మెలిగేవాడు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.



## కావలి కబుర్లు

# కావలిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టండి

### - రైల్వే జిఎంకు బిఎంఆర్ వినతి



కావలి నియోజకవర్గంలో రైల్వేపరంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ కావలి మాజీ ఎమ్మెల్యే, నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ సలహా కమిటీ సభ్యుడు బీద మస్తాన్‌రావు సికింద్రాబాద్‌లో సౌత్‌సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్‌యాదవ్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బిట్రగుంటలో రైల్వేపరంగా చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన తన విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు. బిట్రగుంటలో 8వందల ఎకరాల రైల్వే భూములు ఖాళీగానే ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసేందుకు అక్కడ వ్యాగన్ ఫ్యాక్టరీ, పిఓహెచ్ షెడ్ ఫర్ ఎలక్ట్రిక్ లోకోమోటివ్స్, పిఓహెచ్ షెడ్ ఫర్ ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్ ట్రైన్స్, ఏసి కోచెస్ పిఓహెచ్ వర్క్‌షాప్ వగైరాలను ఏర్పాటుచేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా రైల్వే ఆస్తులను పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కావలి రైల్వేస్టేషన్‌లో అత్యవసర వసతులు కల్పించాలని మరొక వినతిలో బిఎంఆర్ పేర్కొన్నారు. కావలి రైల్వేస్టేషన్‌లో వెస్ట్ బుకింగ్ ఆఫీస్, పడమర వైపు ప్లాట్‌ఫాం పొడిగించడం, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని పొడిగించడం, మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి సౌకర్యం, లగేజీ భద్రపరుచు గది వగైరా వసతులను కల్పించాలని కోరారు. కావలి రైల్వేస్టేషన్ బి–క్లాస్ కేటగిరీ స్టేషన్ అని, విద్యార్థులు ఉద్యోగులు వ్యాపారులు ఎంతోమంది నిత్యం చెన్నై, విజయవాడలకు వెళ్తుంటారని, అందులోనూ వస్త్ర వ్యాపారానికి రెండవ ముంబైగా కావలి ప్రసిద్ధిచెందినదని పేర్కొన్నారు. కావలి రైల్వే స్టేషన్‌వల్ల రైల్వేకి ఆదాయం బాగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. బిఎంఆర్ సూచనలను సావధానంగా విన్న రైల్వే జిఎం ఆ సూచనలన్నిటినీ పరిశీలిస్తామని, రైల్వేపరంగా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధికి తగు కృషిచేస్తామని అన్నారు.

# మెగా జాబ్ మేళా

## 77 మందికి ఉద్యోగాలు



కావలి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. 160 ఉద్యోగాల కల్పనకు రైజింగ్‌స్టార్ మొబైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్–తడ, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, మేనకూరు, నాయుడుపేట కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన ఈ జాబ్‌మేళాలో 179మంది హాజరుకాగా, వీరిలో 57మంది మహిళలున్నారు. రైజింగ్‌స్టార్ మొబైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో 33మంది ఎంపికయ్యారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, మేనకూరు, నాయుడుపేట ఎంపీకి 122 మంది ఇంటర్వ్యూకు హాజరుకాగా 40మంది ఎంపికయ్యారు. మొత్తంగా ఈ జాబ్‌మేళా ద్వారా 77మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి, అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. మునిసిపల్ వైస్‌ఛైర్మెన్ భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్ మాట్లాడుతూ, గతంలో బిఎంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా 996మందికి ఉద్యోగవకాశాలు కల్పించామన్నారు. ఇలాంటి జాబ్‌మేళాలతో కావలి నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, ఎంపిపి పత్రి మహేశ్వరి, నుడా డైరెక్టర్ పాలడుగు రంగారావు, పట్టణ టిడిపి అధ్యక్షులు అమరా వేదగిరి గుప్తా, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, నాయుడు రాం ప్రసాద్‌లతో పాటు ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గురుపూర్ణిమ వేడుకలు

నెల్లూరు నగరంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరాల్లో ఈనెల 8వతేదీ నుండి గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలంకరణలతో బాబా మందిరాలు కనువిందు చేసాయి. ఈ సందర్భంగా బాబా మందిరాల్లో పాలాభిషేకాలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అష్టోత్తర పూజలు, పుష్పాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

**సాయిదర్బార్ అద్దాల మందిరంలో...**

నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని శ్రీ సాయి దర్బార్ అద్దాల మందిరంలో ఈ నెల 8వ తేదీన ఘనంగా గురుపూర్ణిమ వేడుకలు ప్రారంభమయ్యాయి. దేవస్థానానికి విచ్చేసిన శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీరాముని సన్నిధిలో విశేషపూజలు నిర్వహించి వేడుకలకు శ్రీకారం చుట్టారు. బాబాకు ఉదయం హారతులు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. 9వ తేదీ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు "ఓం సాయి శ్రీ సాయి జయజయ సాయి" అఖండ సాయినామ సంకీర్తన జరిగింది. రాత్రి శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణం నిర్వహించారు. అనంతరం భజన, పల్లకి ఉత్సవం, పండరీ భజన, కోలాటాలు, ఊంజల్ సేవ, పవళింపుసేవ తదితర కార్యక్రమాలు జరిగాయి. 10వ తేదీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు శ్రీ సాయి సచ్చరిత్రము పూర్తి గ్రంథము పారాయణం జరిగింది. ఈ కార్యక్రమాలను ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ ఆదివారం ఉదయం 9గంటల నుండి మోడరన్ ఐ




హాస్పిటల్ అండ్ రీసెర్చి సెంటర్ వైద్య బృందంచే ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**ట్రంకురోడ్డు సాయిబాబా మందిరంలో...**

నెల్లూరు ట్రంకురోడ్డు గాంధీనగర్‌లోని శ్రీ షిరిడిసాయిబాబా మందిరంలో ఈ నెల 9వ తేదీ నుండి గురుపౌర్ణమి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ బాబావారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరిగాయి. 9వ తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రతిరోజూ సామూహిక లలితా సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతున్నాయి. 15వ తేదీ బాబా వారికి అత్యంత వైభవంగా పుష్పయాగాన్ని నిర్వహించ నున్నారు. 17వ తేదీ సాయంత్రం 6గంటలకు బాబావారికి అంగరంగ వైభవంగా నగరోత్సవాన్ని, 18వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు మందిర అధ్యక్షులు మన్నెం అమరనాథరెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

# 'పీకే'దేమీ లేదు

(మొదటి పేజీ తరువాయి)

కదన రంగంలో ప్రాణాలొడ్డి పోరాడే సైనికుల్లా కార్యకర్తలుంటే వాళ్ళకి దశాదిశా నిర్దేశించి ముందుకు నడిపించే మేజర్లలా నాయకులున్నారు. అందరి లక్ష్యం ఒక్కటే. అందరి ధ్యేయం ఒక్కటే. అందరి ఆశ, ఆశయం, ఆకాంక్ష ఒక్కటే! 2019లో వై.యస్. జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలి. "రాజన్న" ఆత్మకు నిజమైన శాంతిని చేకూర్చాలి. మరి ఇలాంటి తరుణంలో ఎవరో కొత్త వ్యక్తిని తెరపైకి తెచ్చి ఆయన మార్గదర్శకంలో పార్టీని గెలి పించుకుందాం అని పిలుపునివ్వడం సబబు కాదు.

1983లో తెలుగుదేశం పార్టీని స్థాపించిన నందమూరి తారక రామారావుకు ఎవరు వ్యూహకర్తలుగా పని చేశారు? ఎవరి సలహాలు లేకుండానే ఆయన ప్రజా ప్రభంజనం సృష్టించలేదా? 1989లో ఎటువంటి రాజకీయ వ్యూహకర్తలు లేకుండానే, కనీసం సీఎం అభ్యర్థిని కూడా ప్రకటించకుండానే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాలేదా? 2004లో ఎవరి వ్యూహాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది? వ్యూహకర్తలతో విజయం లభించిందా? లేక వై.యస్. ఇమేజ్‌తో పార్టీ గెలిచిందా? అంతెం దుకు 2014 ఎన్నికల్లో తన సొంత వ్యూహాలతోనే చంద్రబాబు అధికారంలోకి రాలేదా?

గెలుపు అన్నది ఆ బ్రహ్మ వ్రాసి వుండాలి, లేదా ప్రజలు వ్రాయాలి. లేదంటే మన సొంత కృషితో మనమే తిరగరాయాలి. అంతేగాని, మన పార్టీ గెలుపు కోసం ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఆశించడం కరెక్ట్ కాదు. ఇప్పుడు దేశమంతటా ఎన్నికలొస్తే ప్రధానంగా వినిపిస్తున్న పేరు ప్రశాంత్ కిషోర్(పీకే). 2014 ఎన్నికల్లో బీజేపీకి రాజకీయ వ్యూహకర్తగా వ్యవహరించాడు. ఆ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించి మోడీ ప్రధాని అయ్యారు. అలాగే ఆ తర్వాత బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ నితీష్‌కుమార్‌కు ఆయన వ్యూహకర్తగా పనిచేశాడు. ఆ ఎన్నికలలోనూ దళ్(యూ) ఆర్జేడీ కూటమి ఘనవిజయం సాధించాయి. దీంతో ప్రశాంత్ కిషోర్ పేరు మార్మోగిపోయింది. అయితే ఇక్కడ ఆలోచించా ల్సింది... ప్రశాంత్ కిషోర్ సహకారం లేకపోయి వుంటే 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలవదా? బీహార్‌లో దళ్(యూ) గెల వదా? ఎవరున్నా లేకున్నా లోక్‌సభలో బీజేపీ గెలుపును, బీహార్‌లో నితీష్ గెలుపును ఎవరూ ఆపగలిగేవారు కారు. ఎందుకంటే యూపీఏ ప్రభుత్వాన్ని దించేయాలని ప్రజలు డిసైడైపోయారు. ప్రశాంత్‌కిషోర్ లేకున్నా, ప్రధాని అభ్యర్థిగా మోడీని ప్రకటించక పోయి వున్నా ఆ ఎన్నికల్లో అధికారం ఎన్డీఏదే! కాకపోతే మోడీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడంవల్ల అధికారం బీజేపీది అయ్యింది. బీహార్‌లోనూ అంతే! నితీష్‌కుమార్‌పై ప్రజల్లో వ్యతిరేకత లేదు. ఆయన సమర్థుడైన ముఖ్యమంత్రి. బీహార్‌ను అభివృద్ధి బాట పట్టించాడు. దానికితోడు బలమైన ఓటు బ్యాంకున్న ఆర్జేడీతో పొత్తు వుంది. ఆ ఎన్నికల్లో ప్రత్యర్థిగా వున్న బీజేపీ సమర్థుడైన సీఎం అభ్యర్థిని చూపలేకపోయింది. మరి బీహార్ ప్రజలు నితీష్‌ను కాక ఇంకెవరిని గెలిపిస్తారు? మరి ప్రశాంత్‌కిషోర్ రాజకీయ వ్యూహాలు అంత బాగా పనిచేస్తే మొన్న ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో అధికారంలో వున్న సమాజ్ వాది పార్టీ ఎందుకు చతికిలపడింది. ఏ పార్టీ వాళ్లయినా రాజకీయ వ్యూహకర్తలను పెట్టుకోవడంలో తప్పులేదు. అయితే అది పార్టీ అంతర్గత వ్యవహారాలకే పరిమితం కావాలి. ఒక పార్టీ విజయంలో పార్టీ అధినేత నుండి నియోజకవర్గ స్థాయి నాయకులు మొదలుకొని బూత్ స్థాయి కార్యకర్తల వరకు అందరికృషి ఉంటుంది. ఏ పార్టీ గెలుపులో అయినా మొదటి భాగస్వాములు కార్యకర్తలే! అంతేగాని, ప్రశాంత్ కిషోర్ లాంటి వ్యూహకర్తలు కాదు. వ్యూహకర్తలే పార్టీలను అధికారంలోకి తెచ్చే టట్లుంటే భారత రాజకీయ వ్యవస్థను ఇక వాళ్లే శాసించగలరు.

వైకాపా అధ్యక్షుడు జగన్, ప్రశాంత్‌కిషోర్‌ను వ్యూహకర్తగా నియమించుకుని వుండొచ్చు. కాని అది పార్టీ అంతర్గత సమా వేశాలకే పరిమితమై వుండాలి. అంతేగాని ప్లీనరీ వంటి బహిరంగ వేదికలనెక్కించి, ఆయన పుణ్యాన ఇక మనం అధికారంలోకి రానున్నాం అన్నట్లు మాట్లాడకూడదు. ఈ రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు ప్రశాంత్‌కిషోర్ కంటే జగన్‌కే ఎక్కువ తెలిసుండాలి. ప్రజాసమస్యలపై జగన్ స్పందించాలి. వైకాపాకు వేలసంఖ్యలో నాయకులు, లక్షల సంఖ్యలో కార్యకర్తలు, కోట్ల సంఖ్యలో ప్రజలు మద్దతుగా వున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత బలంగా వుంది. ఈ అవకాశాలను అనుకూలంగా మలచుకోవాలి. 2004లో ఎలాంటి ప్రశాంత్ కిషోర్‌లు లేకుండానే చంద్రబాబు ప్రభుత్వాన్ని మట్టికరిపించాడు వై.యస్.రాజశేఖరరెడ్డి. ఇప్పుడు కావలసింది వ్యూహకర్తలు కాదు, సమన్వయకర్తలు. రాజకీయాలతో సంబంధం లేని వై.యస్. కుటుంబ ఆప్తులను జగన్ 13జిల్లాల్లో సమన్వయకర్తలుగా పెట్టుకోవాలి. ఇతరులతో సంబంధం లేకుండా ఆ సమన్వయకర్తలతో నేరుగా జగన్ సంబంధాలు పెట్టుకోవాలి. గ్రామస్థాయి నుండి ఎక్కడ ఏ లోపాలున్నా వెంటనే సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి. ప్రతి జిల్లాలోనూ మారుతున్న సమీకరణలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయగలిగే నిస్వార్థ వ్యక్తిగత వ్యక్తులని ఆయన 13జిల్లాల్లో ఏర్పాటు చేసుకోవాలి. గతంలో వై.యస్. చేసింది కూడా ఇదే. ఎక్కడ సమస్య ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లినా వెంటనే స్పందించేవాడు. ఇందుకు ఎన్నో ఉదా హరణలు "లాయర్" వద్దనే ఉన్నాయి.

"ప్రజలే దేవుళ్ళు... సమాజమే దేవాలయం" అన్న రామా రావు సిద్ధాంతాన్నే వై.యస్. కూడా నమ్మాడు. అందుకే నేరుగా ప్రజల్లోనే మమేకమయ్యాడు. ఎక్కడేం జరుగుతుందో తన ఆంతరంగిక వ్యక్తుల ద్వారా తెలుసుకునేవాడు. ఎక్కడైనా సమస్య ఉంటే పరిష్కరించి పరిస్థితిని తనకు అనుకూలంగా మలచు కునేవాడు. మన రాష్ట్రం గురించి, మన ప్రజల సమస్యల గురించి మనకు అవగాహన వుంటే చాలు, వాటిని పరిష్కరిస్తామని మనం ప్రజలకు నమ్మకం ఇవ్వగలిగితే చాలు... ఎలాంటి ప్రశాంత్ కిషోర్‌ల అవసరం లేకుండానే విజయం సొంతమవుతుంది.

# పాదయాత్రతో మరో చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఏం చేస్తామన్నది కూడా ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. ప్లీనరీలో తెలుగుదేశం ప్రభుత్వ వైఫల్యాలకే గురిపెట్టి జగన్ కొత్త పథకాలను ప్రకటించాడు. ఎన్నికలు ఇంకా దాదాపు రెండేళ్ల దూరంలో వున్నాయి. ఇప్పుడే ఆయన వరాలు, పథకాలు ప్రకటించాల్సిన అవసరం లేదు. కాని, రేపు జరగబోయే నంద్యాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే జగన్ వీటిని ప్రకటించాడనిపిస్తుంది. ముఖ్యంగా రైతులను లక్ష్యంగా చేసుకున్నాడు. 5ఎకరాల లోపున్న రైతులకు సంవత్సరానికి 50వేల సాయం ప్రకటించడం రాజకీయంగా పార్టీకి ఎంతో ప్రయోజనం కలిగించేదే! తెలుగుదేశం ప్రభుత్వంలో రైతాంగం పూర్తి నిరాశకు లోనైంది. చంద్రబాబు ఋణమాఫీ వాగ్దానం అరకొరగానే అమలైంది. పాత ఋణాలు పూర్తి స్థాయిలో మాఫీ కాకపోగా, రైతులకు బ్యాంకులు కొత్తగా అప్పులివ్వడం లేదు. సాగునీళ్ళ సమస్య... గిట్టుబాటు ధరల సమస్య... విత్తనాలు, ఎరువుల సమస్య... ఇలా నిత్యం సమస్యలతో పోరాడుతున్న రైతులకు జగన్ రైతు భరోసా పథకం కొత్త ఆశలు కల్పించేదే!

ఇక మూడు దశలలో మద్య నిషేధాన్ని అమలు చేస్తానన్న జగన్ ప్రకటన మహిళా లోకాన్ని విశేషంగా ఆకర్షించేదే! రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఇదే! 2014 ఎన్నికల్లో కూడా చంద్రబాబు విడతల వారీగా మద్య నిషేధాన్ని అమలు చేస్తానని చెప్పాడు. కాని, అధికారంలోకి వచ్చాక దశలవారీగా మద్యాన్ని విస్తరింపజేశాడు. ఈరోజు 30వేల జనాభా వున్న గ్రామాల్లో కూడా బార్లు పెట్టిస్తానంటున్నాడు. మద్యం విషయంలో చంద్రబాబు ప్రభుత్వంపై మహిళల్లో బలంగానే వ్యతిరేకత వుంది. ఈ అంశాలపై జగన్ గురిపెట్టి కొట్టాడు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి, పింఛన్‌లు వంటివి వై.యస్. హయాంలో మొదలుపెట్టి అమలు చేస్తున్నవే!

అయితే ఇక్కడ నాయకుల విశ్వసనీయత ముఖ్యం. చంద్రబాబు ఆడిన మాటమీద నిలబడడన్నది జనానికి అర్థమైపోయింది. ప్రజల్లో ఆయన పట్ల విశ్వసనీయత లేదు. కాని విశ్వసనీయతకు బ్రాండ్ వై.యస్. కుటుంబం. 2004 ఎన్నికల్లో ప్రజలకు చెప్పిన వాగ్దానాలన్నింటిని నెరవేర్చి చూపించాడు వై.యస్. ఆయన కొడుకుగా జగన్ పట్ల కూడా ప్రజల్లో అదే విశ్వసనీయత వుంది.

ప్లీనరీ వేదికగా జగన్ తీసుకున్న సాహసోపేత నిర్ణయం 3వేల కిలోమీటర్ల పాదయాత్ర. అక్టోబర్ 27న ఇడుపులపాయలో మొదలుపెట్టి ఇచ్ఛాపురం దాకా 13జిల్లాల్లో 6 నెలల పాటు పాదయాత్ర చేయాలని సంకల్పించడం జగన్ పట్టుదలకు నిదర్శనం. జనంలో నిలిచేవాడు, జనంతో నడిచేవాడే నాయకుడు. 2002లో మండుటెండల్లో చేవెళ్ల నుండి ఇచ్ఛాపురం దాకా 1,472 కిలోమీటర్లు దివంగత నేత వై.యస్.రాజ శేఖర్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయింది. ఆ పాదయాత్రలో ప్రత్యక్షంగా ప్రజల కష్టాలను, కన్నీళ్లను చూడబట్టే సీఎంగా బాధ్యతను చేపట్టిన వై.యస్. ఎన్నో ప్రజాసంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. నాటి తండ్రి పాదయాత్రను స్ఫూర్తిగా తీసుకునే జగన్ 3వేల కిలోమీటర్ల పాదయాత్రకు నడుం కట్టాడు.

మొత్తానికి గుంటూరు ప్లీనరీ వైకాపా శ్రేణుల్లో ఉత్తేజం నింపింది. భవిష్యత్‌పై బలమైన ఆశలకు పునాది వేసింది. వచ్చే ఎన్నికల్లో గట్టిగా పోరాడడానికి పార్టీ కేడర్‌కు సరికొత్త శక్తినిచ్చింది.

# కొడుకునే పంపొచ్చుగా...?

(మొదటి పేజీ తరువాయి)

వదిలేసి బయటకొచ్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి రాష్ట్ర రాజకీయాలలో అలుపెరుగని పోరాటం చేస్తూ తన సామర్థ్యం నిరూపించుకుంటున్నాడు. ఇక కేసీఆర్ రాజకీయ వారసుడిగా రంగంలో వున్న కేటీఆర్ మొన్న గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో తన టాలెంట్ చూపించాడు. అంతకుముందు హైదరాబాద్ కార్పోరేషన్ ఎన్నికల్లో పోటీ చేయాలంటేనే టీఆర్ఎస్ నాయకులు భయపడ్డారు. అలాంటిది మొన్న గ్రేటర్ ఎన్నికల్లో మాత్రం కేటీఆర్ అంతా తానై చక్రం తిప్పాడు. 150 డివిజన్లకు గాను వంద డివిజన్లలో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి టీఆర్ఎస్ తెలంగాణ భావిసారధిని తానేనని చాటుకున్నాడు. ఇలా రాజకీయవారసులు అవకాశం వచ్చినప్పుడు తమ ఫెర్ఫార్మెన్స్ ప్రదర్శిస్తూ తమ నాయకత్వంపై పార్టీ కేడర్‌లో నమ్మకం కల్పిస్తున్నారు.

కాని ఇంతవరకు లోకేష్ అలాంటి ప్రతిభా ప్రదర్శన ఏదీ చూపలేదు. రేపు ఒక పార్టీని నడపాల్సిన నాయకుడై వుండి కూడా ప్రజాక్షేత్రంలో దిగి ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎమ్మెల్యేనో, ఎమ్మెల్సీనో లేక ఎంపీగానో ఎన్నికై వుండొచ్చు. అలాకాకుండా తొలిసారిగా ఎమ్మెల్సీ పదవినే దొడ్డిదారి ద్వారా గవర్నర్ కోటాలో తెచ్చుకున్నాడు. ఇక చంద్రబాబు కొడుకు కాబట్టి మంత్రిపదవి ఇవ్వడం పెద్ద విషయమేమీ కాదు. కనీసం లోకేష్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం నుండో, లేక స్థానిక సంస్థల శాసనమండలి నుండో పోటీ చేసి ఎమ్మెల్సీ అయ్యున్నా ఆయన సత్తా తెలుసుండేది. ఆ అవకాశాన్ని ఆయన వదులుకున్నాడు.

ఇప్పుడు ఆయన నాయకత్వ సమర్థతను పరీక్షించేందుకు నంద్యాల ఉపఎన్నికల రూపంలో మరో అవకాశం వచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ద్వారా కేటీఆర్ సామర్థ్యం బయటపడింది. అలాగే నంద్యాల ఎలక్షన్ బాధ్యతను ట్రయల్‌రన్‌గా లోకేష్‌కు అప్పగించి ఉండొచ్చు. కే.ఇ.ప్రభాకర్‌కు నంద్యాల ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. అసలు కె.ఇ కంటే కూడా లోకేష్‌నే అక్కడ దించి వుండొచ్చు. పూర్తి ఎలక్షన్ పర్యవేక్షణ ఆయనపైనే పెట్టివుండొచ్చు. భవిష్యత్‌లో 175 అసెంబ్లీలు, పాతిక లోక్‌సభ స్థానాల ఎన్నికలను పర్యవేక్షించాల్సిన నాయకుడు! ముందుగా కనీసం ఒక అసెంబ్లీలోనైనా తన సత్తా చాటుకోవాలిగా! కాని, చంద్రబాబు లోకేష్‌కు ఈ అవకాశం ఇవ్వలేదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నంద్యాల ఎన్నికల పూర్తి ఇన్‌ఛార్జిగా లోకేష్‌ను నియమించవచ్చు. రేపు నంద్యాలలో తెలుగుదేశం గెలిస్తే ఆ క్రెడిట్ లోకేష్‌దే అవుతుంది. పార్టీ కేడర్‌లో కూడా ఇతడు పప్పు కాదు నిప్పు లాంటి కుర్రాడు అనే నమ్మకం ఏర్పడుతుంది.







# ఆనందోత్సవం... ఆధ్యాత్మికోత్సవం

## హర్ష ఆటోమోటివ్, విపిఆర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బెజవాడలో ఘనంగా శ్రీవారి వైభవోత్సవాలు



వైభవోత్సవాలలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు దంపతులు తదితరులు

*తొట్టతొలిసారిగా గతంలోనే నెల్లూరు నగరంలోని ఏసి స్టేడియంలోను, ఆ తర్వాత దేశ రాజధాని ఢిల్లీలోను, తదుపరి తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోను టీటీడీ సౌజన్యంతో స్వర్ణభారత్ ట్రస్ట్, విపిఆర్ ఫౌండేషన్, వంశీరామ్ బిల్డర్స్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీవారి వైభవోత్సవాలను శోభాయమానంగా, ఆధ్యాత్మిక చరిత్రలో ఓ మధురఘట్టంగా నిర్వహించడం తెలిసిందే! అదే స్ఫూర్తితో విపిఆర్ ఫౌండేషన్, హర్ష ఆటోమోటివ్‌లు కలిసి విజయవాడ నగరవాసులకు కూడా ఆ భాగ్యాన్ని కల్పించాయి.*



వీధి ఉత్సవంలో ఊరేగుతున్న శ్రీవారు

ఈ నెల 2వ తేదీ నుండి 9వ తేదీ వరకు విజయవాడలోని స్వరాజ్య మైదానంలో శ్రీవారి వైభవోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. విపిఆర్ ఫౌండేషన్, హర్ష ఆటోమోటివ్‌ల ఆధ్వర్యంలో తిరుమల క్షేత్రాన్ని తలపించేరీతిలో ఆలయ నమూనాను తీర్చిదిద్దారు. వేలాదిమంది భక్తులు కూర్చుని స్వామివారి సేవలను తిలకించే విధంగా ఏర్పాట్లు చేసారు. ప్రతిరోజూ స్వామివారికి సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, అర్చన, నివేదన, సహస్రదీపాలంకరణ సేవ, ఏకాంత సేవ నిర్వహించారు. ఒక్కోరోజు ఒక్కో విశేషపూజతో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల తిరుపతి వేదపండితుల మంత్రోచ్ఛారణలతో విజయవాడ నగరం పులకించిపోయింది. 9వతేదీ పుష్పయాగంతో శ్రీవారి వైభ వోత్సవాలు ముగిసాయి. లక్షలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, హర్ష మోటార్స్ అధినేత ముప్పవరపు హర్షవర్ధన్, విపిఆర్ ఫౌండేషన్ అధినేతలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీమతి ప్రశాంతిలు వైభవోత్సవాలను పర్యవేక్షించి స్వామివారి సేవలోనే కాదు భక్తుల సేవలోనూ పునీతులయ్యారు.



వెంకయ్యనాయుడుకు తిరునామం దిద్దుతున్న నారా నాగేశ్వరరావు

రాష్ట్రపతి అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, టిటిడి ఇవో అనిల్ సింఘాల్, టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, జెఇవో కోలా భాస్కర్, టిటిడి నుండి వచ్చిన ఇతర అధికారులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు గాయనీ గాయకులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను ఆధ్యాత్మిక సాగరంలో ముంచెత్తాయి. నెల్లూరు నుండి వెళ్లిన శ్రీకృష్ణ చరిత మానస మండలి బృందం వచ్చిన భక్తులందరికీ తిరు నామాలు దిద్ది ఈ భక్తి కార్యక్రమానికి తమవంతు సేవలు అందించారు.

శ్రీవారి వైభవోత్సవాల నిర్వహణతో తిరుమలలో జరిగే విశేష సేవలను విజయవాడ వాసులకు చూసే భాగ్యం కల్పించిన నెల్లూరీయులు వెంకయ్యనాయుడు, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, హర్షవర్ధన్‌లకు 'లాయర్' అభినందనలు.

# వాడవాడలా వైయస్సార్ జయంతి





దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఈ నెల 8న వాడవాడలా ఉత్సాహంగా సాగాయి. పేదల సంక్షేమమే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన దివంగత సిఎం వై.యస్.రాజశేఖర్‌రెడ్డి పేదలపాలిట పెన్నిధి అని నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి కొనియాడారు. వైయస్సార్ 68వ జయంతి సందర్భంగా నెల్లూరు దర్గామిట్టలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో వైయస్సార్ చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. మహానేత భౌతికంగా ఈరోజు లేకపోయినా ప్రజల హృదయాల్లో ఎప్పటికి పదిలంగా ఉంటారన్నారు. వైయస్సార్ ఆశయసాధనకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

ట్రంకురోడ్డులోని వైయస్సార్ విగ్రహానికి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పిలుపుమేరకు 46వ డివిజన్ ఇన్‌ఛార్జి వేలూరు మహేష్ పూలమాల వేసి నివాళు లర్పించారు. దివంగత వై.యస్. అపరభగీరథుడని, ఆయన ప్రవేశపెట్టిన పలు పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని డిసిసి అధ్యక్షుడు పనబాక కృష్ణయ్య పేర్కొన్నారు. ఇందిరాభవన్‌లో వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సామాన్య ప్రజల ఆధ్వర్యంలోనూ వై.యస్. జయంతి కార్యక్రమాలు జరిగాయి. పలుచోట్ల అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. వై.యస్. జ్ఞాపకార్థం విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com